ప్రైవేటు ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్ల యజమానులకు సూచనలిస్తున్న డీఐవో ఉషశ్రీ



రిజిస్ట్రేషన్, వసతులు లేని ఆస్పత్రులను సీజ్ చేస్తాం : డీఐవో

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 20: మదనపల్లె పట్టణంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో ప్రభుత్వ రిజిస్ట్రేషన్, వసతులు లేని ప్రైవేటు ఆస్పత్రులను సీజ్ చేస్తామని జిల్లా పీసీపీఎన్ నోడల్ అధికారి, డీఐవో ఉషశ్రీ హెచ్చరించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలోని డీఈఐసీ భవనంలో ప్రైవేటు ఆస్పత్రుల యజమానులు, స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఐవో మాట్లాడుతూ ఏపీఎంసీఈ 2002 చట్టం ప్రకారం ప్రైవేటు ఆస్పత్రులు, ల్యాబ్‌లు, డయాగ్నస్టిక్ సెంటర్లు, స్కానింగ్ సెంటర్లు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. దీంతో పాటు ప్రైవేటు ఆస్పత్రుల్లో తాగునీరు, రోగులు వెయిటింగ్‌హాల్, మరుగుదొడ్లు, వార్డులు, ఫైర్‌సేఫ్టీ, లిఫ్ట్, ర్యాంప్ పార్కింగ్ తప్పనిసరిగా ఉండాలన్నారు. ప్రతి ఆస్పత్రి రోగి చికిత్సకు అయ్యే ఖర్చు వివరాలకు బిల్లులు ఇవ్వాలన్నారు. అలాగే చికిత్సలకు అయ్యే ఖర్చు ధరలను ఆస్పత్రి నోటీసు బోర్డులో పట్టిక ఏర్పాటు చేయాలన్నారు. డిప్యూటీ డెమో దేవశిరోమణి మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ అనుమతి పొందిన ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీలో లభించే సేవలు, పోస్టర్ల రూపంలో ప్రజలకు తెలియజేయాలన్నారు. స్కానింగ్ సెంటర్లలో పరీక్ష చేయించుకున్న వారికి, ఫార్మసీలో మందులు కొనుగోలు చేసిన వారికి తప్పనిసరిగా రసీదులు ఇవ్వాలని సూచించారు. ప్రతిరోజూ ఈ నివేదికలను డీఐవో కార్యాలయానికి ఆన్‌లైన్ పంపాలన్నారు. సమావేశంలో జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్, హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్‌రఫీ, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లె జిల్లా సాధనకు సమరభేరి ర్యాలీ

● కలిసి వచ్చిన అన్ని పార్టీల నాయకులు

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 20: మదనపల్లె జిల్లా సాధన కోసం బహుజన సేన రాష్ట్ర అధ్యక్షుడు శ్రీచందు ఆధ్వర్యంలో సకల జనుల ఐక్యత ర్యాలీ సమరభేరి కార్యక్రమాన్ని మంగళవారం స్థానిక ఎస్టేట్‌లో అన్ని రాజకీయ పార్టీ నాయకులు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జనసేన రాయలసీమ కో-కన్వీనర్ రాందాస్‌చౌదరి మాట్లాడుతూ ప్రభుత్వానికి మదనపల్లెపై చిత్తశుద్ధి ఉంటే వెంటనే జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. బీటీ కళాశాల యూనివర్సిటీగా మార్చామని జీవో పేరు చెప్పి ప్రజలను తప్పుదోవ పట్టించారని, అలాగే మదనపల్లెను జిల్లా చేయకపోతే మదనపల్లె ప్రజలు నీ కుర్చీని మడతపెట్టి ఇంటికి సాగనంపుతారని హెచ్చరించారు. వైసీపీ ప్రభుత్వం మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు, పుంగనూరు నియోజకవర్గ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసి మదనపల్లెను జిల్లా ప్రకటించకుండా ఇక్కడి ప్రజలకు తీరని అన్యాయం చేసిందన్నారు. రాబోవు ఎన్నికల్లో జనసేన, టీడీపీ ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మదనపల్లెను జిల్లాగా ప్రకటించడం ఖాయమన్నారు. మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జ్ దొమ్మలపాటి రమేశ్ మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రాగానే మదనపల్లెను జిల్లా చేస్తామని ఇదివరకే మదనపల్లె మినీ మహానాడు వేదికగా చంద్రబాబునాయుడు, యువగళం పాదయాత్రలో నారాలోకేశ్ హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు, ప్రజా సంఘాలు, విద్యార్థులు, మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని సమరభేరి ర్యాలీని విజయవంతం చేశారు. కార్యక్రమంలో బహుజన సేన నాయకులు ఆనంద్, జనసేన పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాల శివరాం, జిల్లా జాయింట్ సెక్రటరీ సనావుల్లా, రూరల్ అధ్యక్షుడు గ్రానైట్ బాబు, నాయకులు చంద్రశేఖర్, లోకేశ్, జంగాలగౌతమ్, బలిజ సేవా సంఘం ప్రసాద్, గిరిజన సమాఖ్య అధ్యక్షుడు కోనేటి దివాకర్, ఆటో యూనియన్ నాయకుడు రాఘవేంద్రయాదవ్ తదితరులు పాల్గొన్నారు.



మదనపల్లె జిల్లా సాధనకు సమరభేరీ ర్యాలీని ప్రారంభిస్తున్న దొమ్మలపాటి రమేశ్, రాందాస్ చౌదరి, తదితరులు

సిద్ధంలో.. యుద్ధం..

● జిల్లా వ్యాప్తంగా అధికార పార్టీలో సిగపట్లు
● నోటిఫికేషన్ రాగానే పార్టీలు మారేందుకు రంగం సిద్ధం
● ఎన్నికల్లో వైసీపీ కొంపముంచనున్న అసంతృప్తి సెగలు



(రాయచోటి-ఆంధ్రజ్యోతి): రాబోయే ఎన్నికలు ప్రధాన పార్టీలకు చావోరేవోగా మారాయి. దీంతో ప్రధాన పార్టీలు తమ పార్టీ కార్యకర్తల్లో సమరోత్సాహం నింపేందుకు వరుసగా బహిరంగ సభలు నిర్వహిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా సిద్ధం అంటూ బహిరంగసభలు నిర్వహిస్తున్నారు. ఐదేళ్ల కాలంలో చేసింది కొంతైతే.. కొండంతగా చెప్పుకుంటూ మళ్లీ తనకు అధికారం ఇస్తే ఇప్పుడు చేయకుండా మిగిలిపోయింది.. అంతా చేసేస్తానంటూ.. హామీలు గుప్పిస్తున్నారు. అయితే ఎన్నికలకు సిద్ధం కావాలని జగన్ పిలుపునిస్తోంటే.. జిల్లాలోని అధికార పార్టీలో ముఖ్య నాయకులు, కార్యకర్తలు యుద్ధం చేసుకుంటున్నారు. ఆధిపత్యం కోసం నాయకుల మధ్య విభేదాలు తారాస్థాయికి చేరగా పలుచోట్ల ఎమ్మెల్యేలపై ముఖ్యనాయకులు అసంతృప్తిగళం వినిపిస్తున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ రాగానే అసంతృప్త నాయకులు పార్టీలు మారేందుకు సిద్ధంగా ఉన్నారు. దీంతో జిల్లా వ్యాప్తంగా అధికార పార్టీలో సిగపట్లు ఎన్నికల్లో అధికార పార్టీ కొంప ముంచుతాయని ముఖ్య నాయకులు ఆందోళన చెందుతున్నారు.

రాజంపేట నియోజకవర్గంలో జడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, ప్రస్తుత సిట్టింగ్ ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డికి మధ్య అంతర్గత విభేదాలు నివురుగప్పిన నిప్పులా ఉన్నాయి. ఇటీవల రాజ్యసభకు మేడా మల్లికార్జునరెడ్డి సోదరుడు మేడా రఘునాథరెడ్డితో సీఎం జగన్ నామినేషన్ వేయించారు. దీంతో ఇరువురు నాయకులకు మధ్య విభేదాలకు తాత్కాలికంగా బ్రేక్ పడినట్లేనని పలు మరం రాజకీయ పరిశీలకులు పేర్కొంటున్నారు. తనకు టికెట్ రాకుండా అడ్డుకోవడంలో ఎంపీ మిధున్‌రెడ్డి తెరవెనుక రాజకీయ చేశారని మేడా మల్లికార్జునరెడ్డి లోలోపల రగిలిపోతున్నట్లు పలువురు పేర్కొంటున్నారు. అయితే బహిరంగంగా మీడియా సమావేశాలలో అమర్‌నాథరెడ్డిని 25 వేల మెజార్టీతో గెలిపించుకుంటామని మల్లికార్జునరెడ్డి, ఆయన సోదరుడు రఘునాథరెడ్డి ప్రకటిస్తున్నారు. ఇక రాజ్యసభ పదవి ఏకగ్రీవంగా వచ్చినప్పటికీ.. రాబోయే ఎన్నికల్లో అమర్‌నాథరెడ్డికి మేడా వర్గీయులు ఏమాత్రం సహకరిస్తారో వేచి చూడాల్సిందే. ఐదు సంవత్సరాలుగా నియోజకవర్గంలో మేడా మల్లికార్జునరెడ్డి, అమరనాథరెడ్డికి మధ్య ఆధిపత్యపోరు నడుస్తోంది. ఇరువర్గాల మధ్య కొన్నిసార్లు ఇరువర్గాల మధ్య బహిరంగంగానే.. ఘర్షణలు, వాగ్వాదాలు జరిగాయి. ఇదిలా ఉండగా సోమవారం రాజంపేటలో మేడా వర్గీయులు ఎంపీ మిధున్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డిలకు వ్యతిరేకంగా బల ప్రదర్శనతో పాటు నిరసన ప్రదర్శనలు చేశారు. అసైన్‌మెంట్ కమిటీలో మేడా వర్గీయుల పేర్లను తొలగించి తమకు కావాల్సిన వారి పేర్లను ఎక్కించారని, ఇది కక్షసాధింపుతోనే చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో తమ నాయకుడికి టికెట్ రాకపోవడంతో మేడా వర్గీయులు ఎటువైపు అడుగులు వేస్తారో అని అందరూ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇదే నియోజకవర్గంలోని సుండుపల్లె మండలంలోని వైసీపీ ముఖ్య నాయకులు పలువురు సిద్ధం కార్యక్రమానికి డుమ్మా కొట్టారు. స్థానికంగా ఉన్న నాయకుల మధ్య ఆధిపత్య పోరే ఇందుకు కారణమని పలువురు పేర్కొంటున్నారు.

మదనపల్లె నియోజకవర్గంలో ప్రస్తుతం వైసీపీలో ఎక్కడా వర్గాలు, అసంతృప్తులు బహిరంగంగా కనిపించడం లేదు. మదనపల్లె సమన్వయకర్తగా అధిష్ఠానం మైనార్టీ వర్గానికి చెందిన నిస్సార్ అహమ్మద్‌ను ప్రకటించింది. అదే పార్టీలో ఇంతకాలం స్తబ్దుగా ఉన్న మాజీ ఎమ్మెల్యే తిప్పారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డిలు ఒకటయ్యారు. వీరిద్దరినీ కలుపుకుని వెళ్లాలనే అధిష్ఠానం సూచనతో నిస్సార్ అహమ్మద్ వీళ్లతో కలిసి ఒక వర్గంగా ఉన్నారు. అయితే సిట్టింగ్ ఎమ్మెల్యే నవాజ్‌బాషా ఉన్నప్పటికీ ఆయనకు వర్గం అంటూ ఏమీ లేకపోవడంతో ఒంటరి అయిపోయాడు. కనీసం ఆయన పార్టీ కార్యక్రమాలలో కూడా పాల్గొనడం లేదు. అయితే ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరి వైసీపీని ఓడించే ప్రయత్నం చేస్తున్నారనే ప్రచారం జోరుగా ఉంది. ఇక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యేని మార్చడంతో గతంలో ఆయనతో విభేదించిన పలువురు నాయకులు ప్రస్తుతం పార్టీలో చురుకుగా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.

తంబళ్లపల్లె నియోజకవర్గం వైసీపీలో వర్గాలంటూ ఏమీ లేవు. ఎమ్మెల్యే ద్వారకాధరెడ్డి మాటే వేద వాక్కుగా నడుస్తోంది. దీంతో నియోజకవర్గంలో పలువురు ద్వితీయశ్రేణి, గ్రామ నాయకులు తమకు ఎమ్మెల్యేపైన అసంతృప్తి ఉన్నప్పటికీ నోరు మెదపడం లేదు. అయితే టీడీపీలో ఎమ్మెల్యే టికెట్ ఎవరికి ఇస్తారనే దానిని బట్టి ఇటువంటి నాయకులు తమ భవిష్యత్తు నిర్ణయించుకునే అవకాశం ఉంది.

రైల్వేకోడూరు నియోజకవర్గంలో వైసీపీలో అంతర్గత విభేదాలు తీవ్రంగా ఉన్నాయి. రైల్వేకోడూరు ఎమ్మెల్యే పనితీరుపై సర్పంచి స్థాయి నుంచి కార్యకర్త వరకు తీవ్ర అసంతృప్తితో లోలోపల రగిలిపోతున్నారు. చాలామంది సర్పంచులు తమకు రావాల్సిన కాంట్రాక్టు బిల్లులు రాక ఎకరాలకు ఎకరాలు భూములు అమ్ముకుంటున్నారు. చాలామంది కార్యకర్తలు, నాయకులు, కడుపు చించుకుంటే.. కాళ్లమీద పడుతుంది అనేలా.. లోలోపలే కుమిలిపోతున్నారు. చాలామంది వైసీపీ కార్యకర్తలు, నాయకులు ఎమ్మెల్యే పనితీరు నచ్చక నోటిఫికేషన్ ఎప్పుడు వస్తుందా ఇతర పార్టీల్లోకి జంప్ కావడానికి ఎదురు చూస్తున్నారు. చాలామంది బలిజ, రెడ్లు, కమ్మ తదితర కులాలకు చెందిన నాయకులు వైసీపీ విధానాలు నచ్చక గత ఎన్నికల నాటి నుంచి ఖర్చుపెట్టిన డబ్బు రాక అసంతృప్తితో రగిలిపోతున్నారు. నియోజకవర్గంలో ప్రధానంగా పుల్లంపేట, పెనగలూరు, చిట్వేలి, ఓబులవారిపల్లె, రైల్వేకోడూరు మండలాల్లో వైసీపీ కార్యకర్తలు ఎన్నికల నోటిఫికేషన్ సమయానికి పార్టీ మారి టీడీపీలోకి వచ్చే అవకాశం ఉంది.

పీలేరు నియోజకవర్గంలో వైసీపీలో ఎటువంటి విభేదాలు, కుమ్ములాటలు లేవు. ప్రస్తుత సిట్టింగ్ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డికి వైసీపీ అగ్రనాయకులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిధున్‌రెడ్డి అండదండలు పుష్కలంగా ఉన్నాయి. ఇదే సమయంలో అసెంబ్లీ బరిలో నిలిచేందుకు మరో నాయకులు లేకపోవడంతో ఆయనకు ఎదురే లేకుండా పోయింది. అయితే నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో మండల, గ్రామ పంచాయతీ నేతల మధ్య తగాదాలు, గ్రూపులు ఉన్నప్పటికీ అవి ఎన్నికల్లో పార్టీకి వ్యతిరేకంగా పనిచేసే అంత స్థాయిలో లేవని పలువురు పేర్కొంటున్నారు.

రాయచోటి నియోజకవర్గంలో ఎమ్మెల్యేపైన అసంతృప్తి అంతర్గతంగా ఉంది. ఒకరిద్దరు బయట పడినా మిగిలిన వాళ్లు స్తబ్దుగా ఉన్నారు. కొందరు నాయకులు ఆయనకు ప్రస్తుతం దూరంగా ఉన్నారు. గత ఎన్నికల్లో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి గెలుపు కోసం తీవ్రంగా పనిచేసిన నాయకులు కూడా పలువురు ప్రస్తుతం ఆయనతో విభేదిస్తున్నారు. ఇదే పరిస్థితి నియోజకవర్గంలోని మండలాల్లో కూడా ఉందని చెప్పవచ్చు. మున్సిపాలిటీలో కూడా కొందరు నాయకులకు ఎమ్మెల్యేతో పొసగడం లేదు. టీడీపీ టికెట్ ఎవరికి స్తారో? తేలిన తర్వాత అధికార పార్టీలోని కొందరు అసంతృప్త నాయకులు పార్టీ మారే అవకాశం ఉన్నట్లు రాజకీయ పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయండి

● విద్యా శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు రాఘవరెడ్డి



మాట్లాడుతున్న ఆర్జేడీ రాఘవరెడ్డి

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 20: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని విద్యాశాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు (ఆర్జేడీ) రాఘవరెడ్డి ఆదేశించారు. మంగళవారం స్థానిక మాసాపేటలోని సాయిశుభ కల్యాణ మండపంలో మండల విద్యాశాఖ అధికారులు, అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయులందరూ బాధ్యతగా వ్యవహరించి విద్యార్థులను పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సిద్ధం చేయాలని తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారి శివప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ఏడాది జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపే విధంగా విద్యార్థులను తయారు చేయాలన్నారు. ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ కొండూరు శ్రీనివాస రాజు మాట్లాడుతూ పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు సమాంతరంగా ఓపెన్ స్కూల్ పరీక్షలను కూడా కట్టుదిట్టంగా నిర్వహిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా ఏఎంవో రామకృష్ణ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పదో తరగతి ఫలితాలపై జిల్లా నివేదికను అందజేశారు. కార్యక్రమంలో డీఈవో కార్యాలయం ఏడీ ప్రసాద్‌బాబు, ఎంఈవోలు, ఎస్‌వోలు, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రేపు చలో అనంతపురం

● ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ నేతల దాడికి నిరసనగా ర్యాలీ, ధర్నా
● దాడికి పాల్పడ్డ వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలి ● ఏపీయూడబ్ల్యూజే డిమాండ్

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 20: రాష్ట్రంలో జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, అలాగే అనంతపురం జిల్లా రాప్తాడులో ఫోటోజర్నలిస్టు శ్రీకృష్ణపై దాడి చేసిన వారి మీద హత్యాయత్నం కేసు నమోదు చేసి తక్షణమే అరెస్టు చేయాలని కోరుతూ 22వ తేదీ గురువారం చలో అనంతపురం కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు పల్లేటి రామసుబ్బారెడ్డి, ఉపాధ్యక్షుడు ఎక్కంటి అంజనేయులు, సాయంకాలం ఎడిటర్ వెంకటరెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో జర్నలిస్టులపై రోజురోజుకూ దాడులు పెరుగుతున్నాయని, వీటిని అరికట్టాల్సిన పాలకులే దాడులను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. మొన్నటికి మొన్న అమరావతిలో ఇసుక రవాణాపై వార్త రాసినందుకు ఈనాడు రిపోర్టర్‌పై, పుట్టపర్తిలో ఈనాడు ఫొటోగ్రాఫర్‌పై, నిన్నం రాప్తాడులో సిద్ధం సభ కవరేజీకి వెళ్లిన ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై అధికార వైసీపీ నేతలు దాడి చేయడం దుర్మార్గమని పేర్కొన్నారు. రాప్తాడులో దాడి చేసి 48గంటలు దాటినా ఇంతవరకు నిందితులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దుర్మార్గమని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి శ్రీకృష్ణపై దాడి చేసిన వారిపై హత్యాయత్నం కేసులు నమోదు చేసి తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. గురువారం అనంతపురంలో చేపట్టబోయే ర్యాలీ, ధర్నాలో జర్నలిస్టులు పెద్దసంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే జర్నలిస్టుల ఉద్యమానికి ప్రజాస్వామిక వాదులు, ఉద్యోగ ప్రజా కార్మిక విద్యార్థి యువజన సంఘాల నేతలు మద్దతు ఇవ్వాలని కోరారు.

ఈనాడు కార్యాలయంపై దాడి అమానుషం


కర్నూలులోని ఈనాడు ప్రాంతీయ కార్యాలయంపై వైసీపీ మూక దాడి అమానుషమని ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు రామసుబ్బారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పత్రికా స్వేచ్ఛను వైసీపీ హరిస్తుందనడానికి ఈ దాడులే నిదర్శనమని తెలిపారు. నిజాలు జీర్ణించుకోలేక నిందలు మోపడం, దాడులకు దిగడం, కొట్టి చంపడం అధికార పార్టీకి వెన్నతో పెట్టిన విద్య అని పేర్కొన్నారు. పత్రికా ప్రతినిధులపై దాడి అంటే ప్రజాస్వామ్యంపై దాడి చేసినట్లే అని తెలిపారు. నిందితులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వైవీయూకు కేంద్రం నిధులు రూ.20 కోట్లు మంజూరు

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి20: భారత ప్రభుత్వం పీఎం యూఎస్‌హెచ్‌ఏ ద్వారా వైవీయూకు రూ.20 కోట్లు నిధులు మంజూరు చేసింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ పీఎంయూఎస్‌హెచ్‌ఏ ప్రాజెక్టును మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. పీఎం కార్యక్రమం అనంతరం వైవీయూ వీసీ ప్రొఫెసరు చింతా సుధాకర్ మాట్లాడుతూ వైవీయూకు నిధులు విడుదల చేసిన కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞలు తెలిపారు. మౌలిక వసతుల కల్పన కోసం 2013లో రాష్ట్రీయ ఉచ్చతర శిక్ష అభియాన్ ప్రారంభించారని, అది ఇప్పుడు ప్రధానమంత్రి ఉచ్చతర శిక్ష అభియాన్‌గా మారిందన్నారు. దీని ద్వారా నిధులు వచ్చాయన్నారు. ఈ నిధుల్లో రూ.12 కోట్లు వెచ్చించి యూనివర్శిటీ ప్రాంగణంలో నూతన ఆడిటోరియం, అకడమిక్ బిల్డింగ్ నిర్మిస్తామని వెల్లడించారు. అలాగే సైన్స్ విభాగంలో పరిశోధనలు ప్రోత్సహించేందుకు రూ.6 కోట్లు ఖర్చు చేసి అత్యాధునిక సైంటిఫిక్ ఎక్విప్‌మెంటు కొనుగోలు చేయనున్నామన్నారు. మరో రూ.2కోట్లను విద్యార్థుల బోధనకు అవసరమైన సాంకేతిక పరికరాలు కొనుగోలుకు ఉపయోగించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ వైపీ వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపల్ రఘునాధరెడ్డి, పీఎంయూఎస్‌హెచ్‌ఏ సమన్వయకర్త చంద్రశేఖర్, విజయకుమార్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

దాచుకున్న సొమ్ము దోచుకుని పంచారు

● ఉద్యోగులతో పెట్టుకున్న ప్రభుత్వాలకు మనుగడే లేదు ● మహాధర్నాలో ఏపీ ఎన్జీవో సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి



కలెక్టరేట్ ఎదుట బైఠాయించి నిరసన తెలుపుతున్న ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు

కడప(కలెక్టరేట్), ఫిబ్రవరి 20: ఉద్యోగులు ఏళ్ల తరబడి దాచుకున్న సొమ్మును దోచి పథకాలకు పంచడంతో బిడ్డల చదువులు, పెళ్లిళ్లకు కష్టాలు తప్పలేదని ఏపీ ఎన్జీవో సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీ శివారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగులతో పెట్టుకున్న ప్రభుత్వాలకు మనుగడ ఉండదని గత ఎన్నికలు నిరూపించాయని హెచ్చరించారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల డిమాండ్ల సాధనలో భాగంగా ఏపీ జేఏసీ ఐక్యకార్యాచరణ పిలుపు మేరకు మంగళవారం మహావీర్ సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు అన్నమయ్య, కడప జిల్లాల ఉద్యోగులు ర్యాలీ నిర్వహించి మహాధర్నా చేపట్టారు. జేఏసీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి రవికుమార్ ఆధ్వర్యంలో జరిగిన మహాధర్నాలో కేవీ శివారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి పాలనలో 11వ పీఆర్సీని మూడేళ్లు సాగదీసి తక్కువ చేశారని, కరోనా సాకుతో రివర్స్ పీఆర్సీతో సర్దుకుపోయామన్నారు. ఉద్యోగులకు, పెన్షనర్లకు సకాలంలో జీతాలు రాక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామన్నారు. బ్యాంకులకు ఈఎంఐలు కట్టని కారణంగా సిబిల్ స్కోరు తగ్గి రుణాలివ్వడం లేదన్నారు. ఉద్యోగుల సొమ్ము దాదాపు 30, 40 వేల కోట్లు దోచి, పథకాలకు పంచారని ఆరోపించారు. వెంటనే 12వ పీఆర్సీతో పాటు ఐఆర్ 30 శాతం, న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే చలో విజయవాడ ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ డ్రైవర్ల సంఘ అధ్యక్షుడు కొండయ్య, ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర నాయకులు లక్ష్మిరెడ్డి, ఇలియాస్, జేఏసీ నాయకులు తిమ్మారెడ్డి, నిత్యపూజయ్య, నరసింహారెడ్డి, కాటమయ్య, భూషణం, పద్మనాభరావు, నిర్మలా జ్యోతి, నాగార్జున, బాలయ్య, పెద్ద సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.

‘పట్టు’బట్టారు..!

● సిరికల్చర్ కాలనీలో 11 ప్లాట్లు గోల్‌మాల్
● బడా ప్రజాప్రతినిధి ఒత్తిడి
● వేగంగా కదులుతున్న ఫైల్
● అధికార పార్టీ వారికే ప్లాట్లు

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 20: చేనేత, పట్టు పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహకాల్లో భాగంగా మల్టీ ఎండ్ రీలింగ్, ట్విస్టింగ్ యూనిట్ల ఏర్పాటుకు ప్రభుత్వం స్థలాలు లీజుకు ఇస్తుంది. ఇందులో భాగంగా మదనపల్లె పట్టణ శివారు బైపాస్ రోడ్డు సిరికల్చర్ కాలనీలో విలువైన 11 ప్లాట్లు లీజుకు పొందేందుకు అధికార పార్టీ నాయకులు చక్రం తిప్పుతున్నారు. ఈ ప్లాట్లపై గత ఏడాది వివాదం నెలకొనడం, స్థానిక ఎమ్మెల్యే అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఈ ఫైలు నిలిచిపోయింది. తాజాగా ఈ ఫైలు వేగంగా కదులుతోంది. 11 మంది అనర్హులకు ప్లాట్లు కేటాయించాలని బడా ప్రజాప్రతినిధి ఒత్తిడితో ఫైలు సిరికల్చర్ కమిషనరేట్‌కు చేరుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

ప్రోత్సాహక యూనిట్ల కేటాయింపునకు నిబంధనలు

సాధారణంగా సిరికల్చర్ కాలనీలో 1.50 కుంటల స్థలం కేటాయించాలంటే మల్టీ ఎండ్ రీలింగ్ యూనిట్, ట్విస్టింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలి. దీనికోసం రీలింగ్ అనుభవం ఉన్న వారు యూనిట్ ఏర్పాటుకు అయ్యే ఖర్చులో 25 శాతం డీడీ చెల్లించాలి. 2022 సంవత్సరంలో ఈ యూనిట్ ధర రూ.17 లక్షలు ఉండగా స్థలం కావాల్సిన వారు రూ.4.25 లక్షలు డీడీని సిరికల్చర్ డిపార్ట్‌మెంట్‌కు చెల్లించాలి. మిగిలిన 75 శాతం సొమ్ము ప్రభుత్వం చెల్లిస్తుంది. దీంతో మల్టీ ఎండ్ రీలింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తారు. ఈ స్థలంలో ఐదు నెలల్లో షెడ్డు నిర్మించి, అందులో యూనిట్ ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అంతేకాకుండా ప్రతి నెలా రూ.1500 లీజు ధర చెల్లించాలి. ప్రతి ఏటా ఈ లీజు ధర 10 శాతం పెంచి సిరికల్చర్ డిపార్టుమెంట్‌కు చెల్లించాలి. పదేళ్ల వరకు ఈ లీజు పీరియడ్ ఉంటుంది కాబట్టి యూనిట్లను విక్రయించే అధికారం వీరికి ఉండదు. పదేళ్ల తరువాత మార్కెట్ ధర చెల్లించి యూనిట్ ఉండే స్థలాన్ని రీలర్ పేరున రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చు.

సిరికల్చర్ కాలనీలో అంతా గోల్‌మాల్

బైపాస్ రోడ్డులోని సిరికల్చర్ కాలనీలో 2002లో పలువురు స్థలాలు తీసుకుని రీలింగ్ యూనిట్లను ఏర్పాటు చేశారు. వీరిలో చాలామంది సొంతంగా యూనిట్లు నిర్వహించకుండా ఇతరులకు 10 వేల రూపాయలకు పైగా అద్దెకు ఇచ్చి పబ్బం గడుపుకుంటున్నారు. కొంతమంది అగ్రిమెంట్ మీద స్థలంతో పాటు, యూనిట్లను విక్రయించేశారు. ఇది పోను సిరికల్చర్ కాలనీలో 11 కొత్త యూనిట్ల ఏర్పాటుకు 16.50 కుంటల స్థలం మిగిలి ఉంది. బైపాస్ రోడ్డు పక్కనే ఈ కాలనీ ఉండటంతో కుంట స్థలం ఎంత లేదన్నా రూ.20 లక్షల ధర పలుకుతోంది. దీంతో గతేడాది కొంతమంది అధికార పార్టీ నాయకులు ఈ స్థలాలపై కన్ను వేసి దరఖాస్తు చేసుకున్నారు. విషయం ఎమ్మెల్యే నవాజ్‌బాషా దృష్టికి వెళ్లడంతో ఆయన సూచనలతో ఈ ఫైలు నిలిపివేశారు. అప్పటి నుంచి ఈ ఫైలు సిరికల్చర్ జాయింట్ డైరెక్టర్ కార్యాలయంలోనే ఉండి పోయింది. కాగా ఇటీవల ఓ బడా ప్రజాప్రతినిధి నుంచి ఈ ఫైలులో మరికొన్ని పేర్లు జత చేసి ఫైలును కమిషనరేట్ పంపాలని ఆదేశాలు వచ్చినట్లు సమాచారం. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే లోపు ఈ 11 స్థలాలను కైవసం చేసుకునే దిశగా అడుగులు వేస్తున్నారు. కాగా గత పదేళ్ల ఇదే సిరికల్చర్ పరిశ్రమపై ఆధారపడి రీలింగ్ యూనిట్లు అద్దెకు తీసుకుని నడుపుతున్న అర్హులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అర్హులైన తమను కాదని అనర్హులకు యూనిట్ల స్థలాలు కేటాయించే కుట్ర జరుగుతోందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు దీనిపై పూర్తి స్థాయిలో విచారించి అర్హులకు రీలింగ్ యూనిట్లు, స్థలాలు కేటాయించాలని కోరుతున్నారు.

విచారించాకే కమిషనరేట్‌కు జాబితా..

మదనపల్లె సిరికల్చర్ కాలనీలో ఖాళీగా ఉన్న 11 స్థలాల్లో రీలింగ్ యూనిట్ల ఏర్పాటుకు 11 మంది దరఖాస్తు చేసుకున్నారు. గత ఏడాది ఇక్కడ వివాదం నెలకొనడంతో ఈ ఫైలును నిలిపివేశాము. కానీ దరఖాస్తుదారులు ప్రభుత్వానికి విన్నవించుకోవడంతో క్షేత్రస్థాయిలో విచారిస్తున్నాం. సాధ్యమైనంత వరకు అర్హులకే రీలింగ్ యూనిట్లు మంజూరు చేస్తాం. మాపై ఎవరి ఒత్తిడి లేదు. విచారణ పూర్తయ్యాక ఫైలును సిరికల్చర్ కమిషనర్‌కు పంపుతాము.

- రాజశేఖర్, జాయింట్ డైరెక్టర్, సిరికల్చర్ శాఖ, రాయచోటి



మదనపల్లె సిరికల్చర్ కాలనీలో ఖాళీగా వున్న 16.5 కుంటల స్థలం



అద్దెకు తీసుకుని నడుపుతున్న రీలింగ్ యూనిట్లు

ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో..

● వ్యవసాయానికి విద్యుత్ కోతలతో సతమతం
● ఒకరోజు 5 గంటలకు.. మరో రోజు ఉదయం 8 గంటలకు
● ఏడు గంటలు ఇస్తారో.. తొమ్మిది గంటలు ఇస్తారో తెలియని దుస్థితి

వ్యవసాయానికి విద్యుత్ సరఫరా అస్తవ్యస్తంగా మారింది. వారం పది రోజులుగా ఎప్పుడు విద్యుత్ వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియక రైతులు సతమతమవుతున్నారు. తొమ్మిది గంటలు విద్యుత్ సరఫరా కాకుండా ఏడు గంటలకు కుదించారు. అది కూడా లైన్ కట్ పేరుతో సరఫరా సమయంలో కోతలు పెట్టడం రైతులను కలచివేస్తోంది. ఒకరోజు ఏడు గంటలు మరో రోజు తొమ్మిది గంటలు ఇలా సరఫరా సాగుతోంది.



పులివెందుల, ఫిబ్రవరి 20: ఈ ఏడాది వ్యవసాయం రైతులకు దయనీయంగా మారింది. అటు ఖరీఫ్ ఇటు రబీ సీజన్‌లో సాగుచేసిన పంటలు కాస్త వర్షాలు లేక తుడిచిపెట్టుకుపోయాయి. కనీసం బోరు బావుల కింద అయినా పంటలు సాగుచేసి దిగుబడులు తీసుకుందామనుకుంటే విద్యుత్ కోత రైతుకు సమస్యగా మారింది. వారం పది రోజులుగా విద్యుత్ సరఫరా అస్తవ్యస్తంగా ఉంది. గతంలో విద్యుత్ సరఫరా సమయంలో ఎలాంటి కోతలేకుండా ఇచ్చేవారు. అది కూడా తెల్లవారుజామున 5 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు అందిస్తూ వచ్చారు. ప్రస్తుతం తెల్లవారుజామున 5గంటలకు సరఫరా చేయాల్సిన కరెంటును ఉదయం 8గంటలకు ఇస్తున్నారు. 8గంటల నుంచి 3గంటల వరకు సరఫరా చేయాల్సి ఉంది. మధ్యలో 11:30గంటలకో 12గంటలకో ఎల్ఆర్ పేరుతో గంట నుంచి రెండు గంటల పాటు కోత విధిస్తున్నారు. ఆదివారం తెల్లవారుజామున 5గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ అందించారు. మళ్లీ సోమవారం తెల్లవారుజామున 5గంటలకు విద్యుత్ సరఫరాచేశారు. 5గంటల నుంచి 6:30గంటల వరకు విద్యుత్ ఉంది. తర్వాత 8గంటల వరకు ఎల్ఆర్ పేరుతో కోత విధించారు. 8 నుంచి 12గంటల వరకు సరఫరా కాగా మళ్లీ 12 నుంచి గంటన్నర పాటు కోత విధించారు. ఇలా ఎప్పుడు పడితే అప్పుడు సరఫరా చేయడం ఎల్ఆర్ పేరుతో కోత విధించడం విద్యుత్ అధికారులకు పరిపాటిగా మారింది. ఇదేమని అడిగితే పై అధికారుల సూచనల మేరకే సరఫరా చేస్తామని ఆయా సబ్‌స్టేషన్లలో చెబుతున్నట్లు రైతులు వాపోతున్నారు. గతంలో లాగా తెల్లవారుజామున 5గంటల నుంచి లేదా ఉదయం 8గంటల నుంచి విద్యుత్ సరపరా చేయాలని అది కూడా 7 గంటలు ఇస్తారా.. 9గంటలు ఇస్తారా అనేది ముందే తెలియజేస్తే తాము ఆ ప్రకారం పంటలకు నీటి సరఫరా చేసుకుంటామని రైతులు అంటున్నారు. ఒక రోజు తెల్లవారుజామున 5గంటలకు ఇవ్వడం మరుసటి రోజు ఉదయం 8గంటలకు ఇవ్వడం కాకుండా.. ఒక వారం 5 గంటలకు మరో వారం 8గంటలకు ఇవ్వాలని రైతులు అంటున్నారు.

ప్రస్తుతం బోరుబావుల కింద ఉద్యాన పంటలైన చీనీ, అరటి సాగులో ఉన్నాయి. వాటితో పాటు కొర్ర, వేరుశనగ, పత్తి, నూగు, మిరప తదితర పంటలు బోరుబావుల కింద సాగు చేశారు. ఈ పంటలకు నీటితడులు అందించేందుకు పొలాల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోందని రైతులు అంటున్నారు. ఏ సమయానికి విద్యుత్ అందిస్తారో ఎన్నిగంటలు ఇస్తారో ముందే తెలియజేయాలని రైతులు విద్యుత్ అధికారులను కోరుతున్నారు.


బోరుబావుల కింద సాగైన నూగు పంట

పురుగుల మందు తాగి వృద్ధుడి ఆత్మహత్య


విశ్వనాథరెడ్డి (ఫైల్)

రామాపురం, ఫిబ్రవరి 20: మండలంలోని హసనాపురం పంచాయతీ కుమ్మరపల్లె చెందిన కొవ్వూరి విశ్వనాథ్‌రెడ్డి (75) అనే వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ వీఎల్ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. రాయచోటిలో ఉంటున్న తన కూతురు ఇంటికి వెళ్లిన విశ్వనాథరెడ్డి మంగళవారం రాయచోటి నుంచి ఆటోలో హసనాపురానికి వచ్చాడు. ఇంటికి వెళ్లకుండా తన వ్యవసాయ బావి వద్దకు వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ వివరించారు. తన భార్యకు ఇటీవలే చెయ్యి విరగగా, సమీప బంధువులు ఎవరూ దగ్గరకు తీయకపోవడంతో మనస్థాపం చెందినట్లు పోలీసులు తెలిపారు. రామాపురం పోలీసులు మృతదేహాన్ని లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

భర్త వేధింపులు తాళలేక ఆత్మహత్య

ముద్దనూరు ఫిబ్రవరి 20: భర్త వేధింపు తాళలేక మంగళవారం ఉదయం కట్టుబోడి షబానా (29) ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ దస్తగిరి తెలిపారు. సీఐ సమాచారం మేరకు... పులివెందుల రోడ్డులోని టీవీఎస్ షోరూం వెనుక వీధిలోని ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇనుప కొక్కీకి చీరెతో ఉరి వేసుకుంది. మూడు సంవత్సరాల క్రితం యల్లనూరుకు చెందిన షబానాకు ముద్దనూరుకు చెందిన మహమ్మద్‌బాషాతో వివాహమైంది. భర్త వేధింపులు తాళలేక ఆత్మహత్య చేసుకుంది. మృతురాలు షబానా తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు సీఐ తెలిపారు.

15 మద్యం సీసాలు స్వాధీనం

రామాపురం, ఫిబ్రవరి 20: మండలంలోని గువ్వలచెరువులో మూడే భాస్కర్‌నాయక్ అనే వ్యక్తిని అరెస్టు చేసి 15 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ఎల్‌వీ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. కొన్ని రోజులుగా అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో మంగళవారం దాడులు నిర్వహించామని వివరించారు.

గండి నిత్యాన్నదాన పథకానికి విరాళం


దాతలకు పత్రం అందిస్తున్న ముకుందరెడ్డి

చక్రాయపేట, ఫిబ్రవరి 20: గండి క్షేత్రంలో నిర్వహించే శాశ్వత నిత్యాన్నదాన పథకానికి పలువురు దాతలు విరాళం అందించారు. సోమవారం స్థానిక కార్యాలయంలో అందించిన దాతల వివరాలు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి, చైర్మన్ కావలి కృష్ణతేజలు తెలియజేశారు. యర్రగుంట్లకు చెందిన జక్కు తులశమ్మ కుమారుడు చెన్న కృష్ణారెడ్డి రూ.25 వేలు, మైదుకూరుకు చెందిన యాపరాల అన్నయ్య రూ.25,116, రాజంపేటకు చెందిన నల్లపునేని మనోహరమ్మ రూ.20,116 అందించినట్లు తెలిపారు. వారికి స్వామివారి ప్రత్యేక దర్శనం చేయించినట్లు వారు తెలిపారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

● స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో డీఈవో అనురాధ


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈవో

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 20 : ఉపాధ్యాయులు కాంప్లెక్స్ సమావేశాల్లో తప్పనిసరిగా శిక్షణ పొందాలని.. పొందిన శిక్షణను తరగతి గదిలో అమలు చేయాలని డీఈవో మారెడ్డి అనురాధ ఆదేశించారు. మంగళవారం కడప నగరం మున్సిపల్ హైస్కూలు మెయిన్‌లో జరుగుతున్న కాంప్లెక్స్ సమావేశాలను తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి నెలా జరుగుతున్న కాంప్లెక్స్ సమావేశాలు ఎంఈవోలు, కాంప్లెక్స్ చైర్మన్ ఆధ్వర్యంలో కేటాయించిన షెడ్యూలు ప్రకారం నిర్వహించాలన్నారు. శిక్షణ సమయంలో ఉపాధ్యాయులకు సెలవు కానీ, పర్మిషన్లు కానీ ఇవ్వకూడదని ఎంఈవోలను ఆదేశించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. విద్యార్థులను ఆహారం గురించి అడిగి తెలుసుకున్నారు. ఎంఈవో పాలెం నారాయణ, హెచ్ఎం నాగమణి, మునిరత్నమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాయితీ ధరపై శెనగ బేడలు, గోధుమపిండి



భారత్ ప్రొడక్ట్ విక్రయిస్తున్న దృశ్యం

కడప (ఎన్టీఆర్ సర్కిల్), ఫిబ్రవరి 20 : రాయితీ ధరపై శెనగ బేడలు, గోధుమపిండి విక్రయిస్తున్నట్లు జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ వ్యాపార కార్యనిర్వాహకులు ఎస్.ఖాదర్‌వల్లి తెలిపారు. స్థానిక డీసీఎంఎస్ కాంప్లెక్స్‌లో మంగళవారం భారత్ శెనగబేడలు, భారత్ గోధుమపిండి విక్రయాలను డీసీఎంఎస్ మాజీ చైర్మన్ దండు గోపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఖాదర్‌వల్లి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపడుతున్న భారత్ శెనగబేడలు కిలో 60 రూపాయలు, గోధుమపిండి రూ.27.50 వంతు విక్రయిస్తున్నట్లు తెలిపారు. పట్టణంలోని ప్రజలు నాగరాజుపేట, అరుణాచల ఆసుపత్రి సమీపంలో ఉన్న డీసీఎంఎస్ కౌంటరులో కొనుగోలు చేయవచ్చన్నారు. ఆధార్‌కార్డుకు కిలో శెనగ పప్పు, ఐదు కిలోల గోధుమపిండి తీసుకునే సౌలభ్యం ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సహకారశాఖ అసిస్టెంటు రిజిస్ట్రార్ వైఎస్ సత్యానందం, సహకారశాఖ సిబ్బంది అధికారులు, డీసీఎంఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

అంతుచిక్కని వ్యాధితో గొర్రెల మృతి

● లక్షల్లో నష్టపోయిన రైతులు


వ్యాధితో మృతి చెందిన గొర్రె

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 20: అంతుచిక్కని వ్యాధి కారణంగా ఉన్నట్లుండి తల వాలేసి గొర్రెలు మృతి చెందుతున్నాయని మండలంలోని గొర్రెల కాపరులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కుర్నూతల, దేవళంపల్లె, అగ్రహారం, పందిళ్లపల్లెల్లో 20 రోజులుగా ఈ పరిస్థితి నెలకొందని అంటున్నారు. దేవళంపల్లెకు చెందిన వీరాంజనేయులు అనే రైతు మాట్లాడుతూ చనిపోయిన గొర్రెలను పరీక్షించగా దొమ్మపై పుండ్లు, గుండెకు కంతలు ఉన్నాయని తెలిపారు. ఇది ఏ వ్యాధి లక్షణమో పశువైద్యాధికారులు కూడా చెప్పడం లేదన్నారు. ఈ మధ్యకాలంలో దేవళంపల్లెకు చెందిన కొత్తపల్లె వీరాంజనేయులు, పల్లా రామ్మోహన్ కొత్తపల్లె రామాంజనేయులు, రామిరెడ్డికి చెందిన గొర్రెలు మృతి చెందాయని ఒక్కో గొర్రె ఖరీదు 15 వేల నుంచి 18 వేలు ఉంటుందని తెలిపారు. పశువైద్యాధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని, గోపాలమిత్రలు వచ్చినా, సరైన మందులు ఇవ్వకపోగా మందులు కొని తెచ్చుకోవాలని చెబుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మిగిలిన గొర్రెలకు పరీక్షలు నిర్వహించి చనిపోకుండా చూడాలని బాధితులు కోరుతున్నారు.

డ్రాయింగ్ పోటీల్లో సీకే దిన్నె విద్యార్థికి మొదటి బహుమతి


విద్యార్థి హర్షవర్ధన్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

సికెదిన్నె, ఫిబ్రవరి 20: 35వ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా నిర్వహించిన డ్రాయింగ్ పోటీల్లో చింతకొమ్మదిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పి.హర్షవర్ధన్ మొదటి బహుమతి గెలుచుకున్నట్లు ఉపాధ్యాయులు గురవయ్య తెలిపారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఆరు నుండి 9వ తరగతి విద్యార్థులకు జిల్లాస్థాయి డ్రాయింగ్, ఎస్సే రైటింగ్, క్విజ్ పోటీలను రవాణాశాఖ నిర్వహించగా తమ పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి హర్షవర్ధన్ డ్రాయింగ్ పోటీల్లో మొదటి బహుమతి గెలుచుకున్నారు. ఈసందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు శోభారాణి, మండల విద్యాశాఖాధికారులు వెంకటరామిరెడ్డి, రమాదేవి, తదితరులు, విద్యార్థులు అభినందించారు.

పేరు జాస్తి.. వైద్యం నాస్తి

● కనిపించని డాక్టర్ ● అన్నింటికీ స్టాఫ్ నర్సే గతి ● అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఇదీ దుస్థితి


అర్బన్ హెల్త్ సెంటర్‌లో తెరుచుకోని తలుపులు

రాయచోటి(కలెక్టరేట్), ఫిబ్రవరి 20: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన అర్బన్ హెల్త్ సెంటర్లలో డాక్టర్లు లేక వెలవెలపోతున్నాయి. ఒక డాక్టరు, ఒక స్టాఫ్ నర్సు, ఇద్దరు అసిస్టెంట్స్, ఒక ల్యాబ్ టెక్నీషియన్, ఇద్దరు సిబ్బంది ఉండాలి. ఇక్కడ మాత్రం కేవలం ఒకే ఒక్క స్టాఫ్ నర్సు ఉన్నారు. ప్రజల ఇంటిముంగిటకే వైద్యం అందుబాటులో ఉంచామంటూ ప్రభుత్వం గొప్పగా చెప్పుకుంటున్నా.. ఇక్కడ వైద్యం మాత్రం అందకపోవడం విమర్శలకు తావిస్తోంది.

రాయచోటిలోని ఎస్ఎన్ కాలనీకి చెందిన 16వ వార్డు అర్బన్ హెల్త్ సెంటర్‌లో వైద్యుడు, సిబ్బంది లేకపోవడంపై పలు రకాల విమర్శలు వినపడుతున్నాయి. ఉదయం 11 గంటలకే అర్బన్ హెల్ సెంటర్‌లో డాక్టర్లు లేకపోవడం చాలా విచిత్రంగా ఉందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం అధునాతన పరికరాలతో హెల్త్ సెంటర్లు నిర్మించి ప్రజల ముంగిటకే వైద్యం చేరవేశామంటూ ఆర్భాటంగా చేస్తున్న ప్రకటనలు కేవలం ప్రకటనలకే పరిమితం అవుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక్కడ పని చేస్తున్న వారిలో ఇద్దరు క్యాజువల్ లీవ్‌లో ఉన్నారు. మిగిలిన వారిలో ముగ్గురు విధులకు రావడం లేదని తెలిసింది. దాదాపు 30 వేల జనాభాకు సేవలు అందించాల్సిన ఈ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో కేవలం ఒకే ఒక్క స్టాఫ్ నర్సు ఉండడం, మిగిలిన గదులకు తాళాలు వేసి ఉండడం రోగులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఇప్పటికైనా జిల్లా అధికారులు ఇక్కడ రెగ్యులర్ డాక్టర్‌ను ఏర్పాటు చేసి వైద్యం అందేలా చూడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

అధికారి ఏమన్నారంటే..

ఈ విషయంపై డీపీయం రియాజ్‌బేగ్‌ను వివరణ కోరగా.. ఈ వ్యవహారం తన దృష్టికి వచ్చిన వెంటనే అర్బన్ హెల్త్ సెంటర్‌కు వెళ్లి చూశానన్నారు. అక్కడ ఒక్క స్టాఫ్ నర్సు మాత్రమే ఉన్నారన్నారు. మిగిలిన వారు ఎందుకు రావడం లేదో తెలియదని, వారికి సంజాయిషీ నోటీసులు ఇస్తామన్నారు.

ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బాలగంగిరెడ్డి


బాలగంగిరెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

సికెదిన్నె, ఫిబ్రవరి 20: ఎస్టీయూ 77వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కంభం బాల గంగిరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో జరిగిన సమావేశంలో బాలగంగిరెడ్డిని ఏకగ్రీవంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నుకోవడంతో ఆయన సహచరులు, మిత్రులు, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన పనిచేస్తున్న చింతకొమ్మదిన్నె మండలం కొలుములపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తోటి ఉపాధ్యాయులు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పోరాటం చేసి పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాసులు, వీరేంద్ర, నారాయణరెడ్డి, నాగప్రకాశ్ రావు, మాధవి, జేవీ సుబ్బరాయుడు, భారతి, తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-2 అభ్యర్థుల కోసం కంట్రోల్ రూమ్

రాయచోటి (కలెక్టరేట్), ఫిబ్రవరి 20: జిల్లాలో ఈనెల 25న జరగబోయే గ్రూప్-2 పరీక్ష రాసే అభ్యర్థుల కోసం కలెక్టరేట్‌లో ఈనెల 23 నుంచి 25 వరకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయబోతున్నట్లు కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పరీక్ష రాయబోయే అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి చేరుకోవడంలో ఎటువంటి ఇబ్బంది తలెత్తినా 0851-293006 నెంబరుకు కాల్ చేస్తే కంట్రోల్ రూమ్ వారు సహకరిస్తారని తెలిపారు.

ఇంటి స్థల విషయమై ఘర్షణ

8 మందిపై కేసు నమోదు

గుర్రంకొండ, ఫిబ్రవరి 20: ఇంటి స్థలం విషయమై ఇరువర్గాలు ఘర్షణపడడంతో 8 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాస్‌నాయక్ తెలిపారు. ఆయన వివరాల మేరకు... మండలంలోని రామాపురం పంచాయతీ నక్కలవారిపల్లెకు చెందిన ఇ.వెంకటరమణకు అదే గ్రామానికి చెందిన ఎం.నరేష్‌బాబుకు ఇంటి స్థల విషయమై కొంత కాలంగా గొడవలున్నాయి. ఈ క్రమంలో స్థలంలో మంగళవారం వెంకటరమణ కూసాలు నాటుతుండగా నరేష్‌బాబు కుటుంబ సభ్యులు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాలు ఘర్షణ పడ్డారు. ఈ గొడవలో వెంకటరమణ, యల్లప్పలకు గాయాలయ్యాయి. వెంకటరమణ ఫిర్యాదు మేరకు ఎం.నరేష్‌బాబు, సుబ్బరాజు, జయతులసీ, సునీల్‌కుమార్‌లపై కేసు నమోదు చేశామన్నారు. అలాగే నరేష్‌బాబు ఫిర్యాదు మేరకు వెంకటరమణ, ఇంద్రావతి, యల్లప్ప, భారతిలపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

260 పరుగుల ఆధిక్యంలో రైల్వేస్ జట్టు


అన్షుయాదవ్, రైల్వేస్ (235)


రవిసింగ్, రైల్వేస్ (258)


అంచిత్‌యాదవ్, రైల్వేస్ (117)

కడప (స్పోర్ట్స్), ఫిబ్రవరి 20 : కల్నల్ సీకే నాయుడు ట్రోఫీ క్రికెట్ మ్యాచ్‌లలో భాగంగా నగర రిమ్స్ సమీప వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియంలో ఆంధ్రా-రైల్వేస్ జట్ల మధ్య జరుగుతున్న నాలుగు రోజుల క్రికెట్ మ్యాచ్‌లో మూడవ రోజు ఆట ముగిసే సమయానికి రైల్వేస్ జట్టు 260 పరుగుల ఆధిక్యత సాధించింది.

తొలుత టాస్ నెగ్గిన ఆంధ్రా జట్టు బ్యాటింగ్‌కు దిగి మొదటి ఇన్నింగ్స్‌లో 93.5 ఓవర్లలో 378 పరుగులు సాధించింది. ఇందులో ఎం.వంశీకృష్ణ 110 పరుగులు చేయగా ధరణికుమార్ నాయుడు 81 పరుగులు, టి.వంశీకృష్ణ 55 పరుగులు, ఎస్.వెంకటరాహుల్ 61 పరుగులు చేసి జట్టు భారీ స్కోర్‌కు బాటలు వేశారు.

అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రైల్వేస్ జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో 174 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 638 పరుగుల భారీ స్కోర్ సాధించింది. ఇందులో రవిసింగ్ (బ్యాటర్) 258 పరుగుల భారీ స్కోర్ చేయగా, మరో బ్యాటర్ అన్షుయాదవ్ 235 పరుగులతో, అంచిత్‌యాదవ్ 117 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో ఉన్నారు. దీంతో రైల్వేస్ జట్టుకు 260 పరుగులు ఆధిక్యత లభించింది. బుధవారం చివరిరోజు ఆట జరగనుంది.

ప్రయాణికులతో మర్యాదగా వ్యవహరించాలి

● ఆర్టీసీ ఆర్ఎం గోపాల్‌రెడ్డి


శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న గోపాల్‌రెడ్డి

కడప (మారుతీనగర్) ఫిబ్రవరి 20 : ఆర్టీసీ బస్సులలో ప్రయాణం చేసే ప్రయాణీకుల పట్ల డ్రైవర్లు మర్యాదపూర్వకంగా ఉండాలని ఆర్టీసీ కడప రీజనల్ మేనేజర్ పి.గోపాల్‌రెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక డీపీటీఓ కార్యాలయంలో ప్యాసింజర్ కంప్లైంట్, బిహేవియర్ ఆఫ్ క్రూ యాక్సిడెంట్ ప్రోన్ డ్రైవర్స్ డ్రంకన్ డ్రైవర్స్ అత్యల్ప ఇంధన పొదుపు డ్రైవర్స్‌కు ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్సు నడిపే డ్రైవర్ చేతిలో సుమారు 40 నుంచి 50 మంది ప్రయాణీకుల ప్రాణాలు ఉన్నాయనే సంగతిని మరువరాదన్నారు. వారిని సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చే బాధ్యత ప్రతీ ఆర్టీసీ డ్రైవర్‌కు ఉందన్నారు. సంస్థ పురోగతికి కారకులైన డ్రైవర్లు బాధ్యతగా.. మంచి అలవాట్లను పాటించి వారి ఆరోగ్యాలతో పాటు ప్రయాణీకుల ప్రాణాలకు భరోసా కల్పించాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో రీజనల్ సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్ సుధాకృష్ణారెడ్డి, కడప సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్ జి.రామయ్య, పలువురు డ్రైవర్లు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానం మేనిఫెస్టోలో చేర్చండి


శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందిస్తున్న యూటీఎఫ్ నాయకులు

కడప (ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 20: రాబోవు ఎన్నికల్లో టీడీపీ ప్రకటించబోయే మేనిఫెస్టోలో పాత పెన్షన్ విధానం పునరుద్ధరిస్తామనే హామీని చేర్చేవిధంగా రాష్ట్ర నాయకత్వంపై ఒత్తిడి తేవాలని యూటీఎఫ్ ప్రతినిధులు కోరారు. మంగళవారం కడపలోని శ్రీనివాసరెడ్డి నివాసంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబు ఆయనను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో టీడీపీ ప్రకటించబోయే మేనిఫెస్టోలో సీపీఎస్ విధానాన్ని పునరుద్ధరిస్తూ అధికారంలోకి వచ్చిన వెంటనే మొదటి సంతకం చేసే విధంగా టీడీపీ ప్రకటించాలని కోరారు. ఏ రాజకీయ పార్టీ అయితే పాత పెన్షన్ పునరుద్ధరిస్తామని హామీ ఇస్తుందో వారికే రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయులందరూ ఓట్ ఫర్ ఓపీఎస్ అనే నినాదం ద్వారా మద్దతు పలుకుతామని తెలిపారు. టీడీపీ రాష్ట నాయకత్వం దృష్టికి పాత పెన్షన్ విధానాన్ని తీసుకెళ్లిమేనిఫెస్టోలో చేర్చే విధంగా చొరవ చూపాలని శ్రీనివాసరెడ్డిని కోరారు. ఆయన స్పందిస్తూ పాత పెన్షన్ పునరుద్ధరణకు చర్యలు తీసుకునే విధంగా రాష్ట్ర నాయకత్వంపై ఒత్తిడి తీసకువస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎజాజ్ అహ్మద్, నాయకులు గోపినాద్, అబ్దుల్ గని, వెంకటరమణ, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

ఘనంగా భీష్మ ఏకాదశి



గ్రామోత్సవంలో సీతారామలక్ష్మణులు

ఒంటిమిట్ట, ఫిబ్రవరి 20 : భీష్మ ఏకాదశి సందర్భంగా మంగళవారం వేకువజామున స్థానిక కోదండ రామాలయంలో మూలవిరాట్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ మూర్తులకు గ్రామోత్సవం చేశారు. టీటీడీ అర్చకులు మనోజ్‌కుమార్, వీణారాఘవాచార్యులు, ప్రవీణ్ కుమార్, టీటీడీ అధికారులు పాల్గొన్నారు.

రేషన్ సరుకులు ఇంటింటికి సరఫరా చేయాలి

సిద్దవటం, ఫిబ్రవరి 20: మండలంలోని 18 గ్రామ పంచాయతీల్లో ఇంటింటికి రేషన్ సరుకులను సరఫరా చేయాల్సిందేనని తహసీల్దారు మురాషావలి స్పష్టం చేశారు. సిద్దవటం తహసీల్దారు కార్యాలయంలో మంగళవారం నిత్యావసర సరుకుల పంపిణీపై ఎంఆర్ఐ, వీఆర్వోలు, చౌకదుకాణ డీలర్లు, ఎండీఎం ఆపరేటర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి లబ్ధిదారుని ఇంటికి నిత్యావసర సరుకులు చేరాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. ఈ విషయంలో ఎవరైనా నిర్లక్ష్యం వస్తే అటువంటి వారిపై చర్యలు తప్పవన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి



ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 20: చెన్నముక్కపల్లె గ్రామ పంచాయతీలోని 5వ వార్డు ప్రజల తాగునీటి సమస్యను పరిష్కరించాలని సీపీఐ అన్నమయ్య జిల్లా కార్యవర్గ సభ్యుడు సిద్దిగాళ్ల శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మహిళలతో కలిసి ఖాళీ బిందెలతో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మూడు నెలలుగా తాగడానికి నీళ్లు లేక దాదాపు 500 కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా స్థానిక సర్పంచ్ గానీ, పంచాయతీ సిబ్బంది గానీ అటువైపు చూడకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు మహిళలతో పాటు సీపీఐ పట్టణ నాయకులు సల్లావుద్దీన్, ఆరీఫుల్లా, ఖదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

గట్టు కొండకు నిప్పు.. రెండు హెక్టార్లలో అడవి దగ్ధం

బి.కొత్తకోట,ఫిబ్రవరి20: బి. కొత్తకోట మండల పరిధిలోని గట్టు గ్రామ శివారులోని కొండప్రాంతానికి మంగళవారం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. దీంతో ఇంత కాలం పచ్చగా ఉన్న సుమారు 2హెక్టార్ల అటవీప్రాంతం అగ్నికి ఆహుతి అయింది. ప్రతి యేడాది వేసవి ప్రారంభంలో ఈ అటవీప్రాంతానికి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడం పరిపాటిగా మారిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ ప్రాంతం హార్స్‌లీహిల్స్ సెక్షన్ పరిధిలోకి వస్తుంది. ఈ సంఘటనపై సమాచారం అందినప్ప టికీ మంటలను అదుపు చేసే అవకాశం లేక అటవీశాఖ అధికా రులు సకాలంలో స్పందించడానికి వీలులేకుండా పోయింది.

మతిస్థిమితం లేని వివాహిత అదృశ్యం

రామసముద్రం, ఫిబ్రవరి 20: రామసముద్రం మండలం, చెంబకూరు గ్రామ పంచాయతీ, మూడు రోడ్ల కూడలి సమీపంలో గల ఇందిరానగర్ కాలనీలో కాపురం ఉండే నారె రామనాథ్‌రెడ్డి భార్య నారె సుధ(44) గత శుక్రవారం ఇంటి నుండి ఎక్కడికో వెళ్లిపోయినట్లు భర్త రామనాథ్‌రెడ్డి మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. తన ఇద్దరు కుమారుల అకాల మరణం చేత తన మానసిక స్థితి సక్రమంగా లేనందున అప్పుడప్పుడు ఇంటి నుండి బయటకు వెళ్లిపోయేదని గతంలో కూడా పలుమార్లు సుధ ఇంటి నుండి వెళ్లిపోగా ఆమెను వెతికి ఇంటికి పిలుచుకుని రావడం జరిగిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే ఈ సారి బంధువుల ఊర్లకు వెళ్లి విచారించినా ఆమె ఆచూకి తెలియడం లేదని భర్త రామనాథ్‌రెడ్డి ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రేపటి నుంచి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు

కలకడ, ఫిబ్రవరి 20:మండలంలోని గంగాపురం పంచాయితీ బాహుదా నది ఒడ్డునున్న కోటి లింగేశ్వరాలయంలో గురువారం నుంచి శనివారం వరకు మహాగణపతి, నందీశ్వర, సూర్య, చంద్ర గ్రహాల విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

నేడు అంగళ్లులో ఉరుసు

కురబలకోట, ఫిబ్రవరి 20: మండలంలోని అంగళ్లులో రెండు రోజుల పాటు హజ్రత్ సయ్యదినా షేఖ్ అబ్దులాఖాధర్ జిలానీ పీరానెపీర్ గౌసుల్ అజం దస్తగీర్ ఉరుసు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బుధవారం రాత్రి గంధోత్సవం గురువారం ఖవ్వాలి నిర్వహిస్తారని, భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

రెచ్చగొట్టే ప్రసంగాలతోనే.. దాడులు

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 20: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగిస్తున్న ప్రతి బహిరంగ సభలోనూ తాను యుద్ధం చేస్తున్నది చంద్రబాబుతో కాదని, ఆంధ్రజ్యోతి, ఈనాడు, టీవీ5లతోనే అంటూ రెచ్చగొట్టే ప్రసంగాలు చేయడమే ఆయా సంస్థల విలేకరులు, ఫొటో గ్రాఫర్లపై దాడులకు కారణమని, దీనికి ముఖ్యమంత్రే ప్రధాన బాధ్యుడు అవుతాడని న్యాయకోవిదులు అభిప్రాయపడుతున్నారు. హింసతో సమాధానం చెప్పదలుచుకుంటే ప్రజా స్వామ్యానికి అర్థమే ఉండదని అంటున్నారు. దాడులు ప్రోత్సహించి పాలన చేయాలనుకునే వారు కనుమరుగు కావడానికి ఎంతో కాలం పట్టదని అంటున్నారు. వారి మాటల్లోనే....

రెచ్చగొట్టేవారూ నేరస్థులే..



బహిరంగ సభల్లో చేసిన ప్రసంగాలతో ఆవేశానికి లోనైన వ్యక్తులు దాడులు చేస్తే ఐపీసీ సెక్షన్ 505 ప్రకారం మూడేళ్ల వరకు జైలు శిక్ష అను భవించాల్సి ఉంటుంది. పథకం ప్రకారం ఫొటోగ్రాఫర్‌ను హత మార్చడా నికి వచ్చినట్లు ఉంది కాబట్టి.. 307 ఐపీసీతో పాటు 324 వర్తిస్తుంది. రాజ్యాంగబద్ధంగా విధులు నిర్వహిస్తానని ప్రమాణం చేసిన ముఖ్యమంత్రి రెచ్చగొట్టే ప్రసంగాలు చేయడం నేరం.

- టీ. ఈశ్వర్, , ఉమ్మడి కడప జిల్లా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు

బడుగు, బలహీనులకు రక్షణే కరువైంది



వైసీపీ ప్రభుత్వంలో బడుగు, బలహీన వర్గాలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. నా బీసీలు, నా ఎస్సీలు, నా ఎస్టీలు అని ప్రసంగాలు చేసే జగన్ మోహన్‌రెడ్డి.. ఆయా వర్గాలపై దాడులు చేసే వారిపై చర్యలు తీసుకోవడం లేదు. వాస్తవాలను ప్రజల దృష్టికి తీసుకెళుతున్న వారిపై దాడులు జరుగుతున్నాయి. రాప్తాడులో ఫొటో గ్రాఫర్‌పై జరిగిన దాడి హేయమైనది. ఇలాంటి చర్యలకు ప్రతి ఒక్కరూ ఖండించాలి.

- డీ. నాగముని, జిల్లా అధ్యక్షుడు, బీసీ న్యాయవాదుల సంఘం

రాచరిక పాలనకు బీజాలు



రాజ్యాంగం ప్రజలకు కల్పించిన హక్కులు మన రాష్ట్రంలో ప్రశ్నార్థకం అవుతున్నాయి. ప్రశ్నించిన వారిని నామరూపాలు లేకుండా చేస్తున్నారు. గత ఐదేళ్ల వ్యవధిలో రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాలపైన జరిగిన దాడులే ఇందుకు నిదర్శనం. ఇదేమిటని ప్రశ్నించే పత్రికా రంగంపైన.. ముఖ్యంగా విలేకరులపైన అమానవీయ దాడులు జరుగుతున్నాయి. రాప్తాడులో విలేకరి కృష్ణపై జరిగిన దాడి ఈ కోవలోనిదే.

- రాజ్‌కుమార్‌రాజు, ప్రధాన కార్యదర్శి, అన్నమయ్య జిల్లా న్యాయవాదుల సంక్షేమ సమితి,

రాజ్యాంగాన్ని పక్కన పెట్టాలని చూస్తున్నారు



దేశంలో ఎవరికీ రాజ్యాంగ విరుద్ధంగా ప్రవర్తించే హక్కులేదు. ఈ ఐదేళ్లలో మన రాష్ట్ర ప్రభుత్వం ప్రజల అన్ని రకాల హక్కులను కాలరాస్తోంది. ప్రజల వైపు నిలబడుతున్న మీడియా నోరు మూయించడానికి ఆ సంస్థల ప్రతినిధులపై దాడులు చేస్తున్నారు. ఈ సంఘటనను ముఖ్యమంత్రి కనీసం ఖండించే ప్రయత్నం కూడా చేయకపోవడంతో.. ఈ దాడి వెనుక ఆయన హస్తం ఉందని అనుకోవాల్సి వస్తుంది.

- బీవీ రమణ, బీఎస్పీ లీగల్ అడ్వైజర్

భయపెట్టి అధికారంలోకి రావాలనుకోవడం అవివేకం



రైల్వేకోడూరు: వినతిపత్రం అందిస్తున్న విలేకరులు, ప్రజాసంఘాల నేతలు



మాధవరం: కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న టీడీపీ నేతలు

పెనగలూరు, ఫిబ్రవరి 20 : ప్రజలను భయపెట్టి అధికారంలోకి రావాలనుకోవడం అవివేకమని సీపీఐ, టీకేఎంయూ నాయకులు హితవు పలికారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి గానుగపెంట ఆదినారాయణ, రైల్వేకోడూరు నియోజకవర్గ టీకేఎంయూ అధ్యక్షులు రేవూరి శంకరయ్య మాట్లాడుతూ ఆంధ్రజ్యోతి ఫొటో గ్రాఫర్‌పై దాడి నీచాతినీచమైన చర్యగా అభివర్ణించారు. ప్రజలు ప్రతి విషయాన్ని గమనిస్తుంటారని, ఎప్పుడు ఏ సమయంలో ఏ తీర్పునివ్వాలో వారికి తెలుసన్నారు. నాలుగేళ్ల పది నెలల కాలంలో వైసీపీ అవలంబించిన ప్రజావ్యతిరేక విధానాల వల్ల తుడిచిపెట్టుకుపోవడం ఖాయమని జోస్యం చెప్పారు. పోలీసు అధికారులు అధికార పార్టీ భజన మానుకుని నిందితులను వెంటనే అరెస్టు చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి ఇ.లక్ష్మీ నారాయణ, టీడీపీ యువ నాయకులు లింగం నరేష్‌లు కూడా పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో నిరసన

సిద్దవటం, ఫిబ్రవరి 20 : ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై జరిగిన దాడిని నిరసిస్తూ మాధవరం గ్రామ పంచాయతీలో మంగళవారం సాయంత్రం టీడీపీ నేతలు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజంపేట పార్లమెంటు కార్యదర్శి నాగమునిరెడ్డి, రాష్ట్ర వాణిజ్య విభాగం అధికార ప్రతినిధి గంజి సుబ్బరాయుడు, బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి శివ, ఉప్పరపల్లి వార్డు మెంబరు ప్రతినిధి పొట్ట శివ, జింక ఓబులేసు, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నిజాలు రాస్తే దాడులు చేస్తారా...

రాజంపేట: నిజాలు రాసినా, చెప్పినా వారిపై దాడులు చేస్తారా అని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు ప్రశ్నించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జగన్ ఓడిపోతాడనేది నిజమని, ఆ నిజాన్ని ఊహించుకోలేక ఇలాంటి అప్రజాస్వామిక, అనైతిక దాడులకు పాల్పడుతున్నారన్నారు. ఒక పత్రిక యజమాని అయి ఉండి మీడియాలో పనిచేస్తున్న సిబ్బంది మీద దాడులకు తెగబడటం చూస్తుంటే జగన్ లాంటి విధ్వంసకారికి అధికారం కట్టబెట్టినందుకు సమాజం సిగ్గుపడుతోందన్నారు. మీడియాను అణగదొక్కాలనే నియంతలు చాలా మంది కాలగర్భంలో కలిసిపోయారనేది జగన్ గుర్తుంచుకోవాలన్నారు.

దాడి నీతిమాలిన చర్య

సిద్దవటం: ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ కార్యకర్తల దాడిని సిద్దవటం మండల టీడీపీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి దశరథనాయుడు, పార్లమెంటు ఉపాధ్యక్షుడు పుత్తా రామచంద్రయ్య ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. టీడీపీ నాయకులు కమ్మపాలెం రవికుమార్ నాయుడు, యూనిట్ ఇన్‌చార్జి పుత్తా శివానంద తదితరులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

ఓబులవారిపల్లె: పత్రికా విలేకర్లపై దాడి చేయడం హీనమైన చర్య అని ఇలాంటి ఘటనకు పాల్పడిన వారిపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అంబేద్కర్ సంఘాలు, సీపీఐ నాయకులు, మం డల పత్రికా విలేకర్లు డిమాండ్ చేశారు. సమతా సైనిక్‌దళ్ జిల్లా అ.ధ్యక్షుడు చౌడవరం సుబ్బనరసయ్య సీపీఐ నాయకులు చిన్నయ్య, మండల కార్యదర్శి నాగమ్మ, అంబేద్కర్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు పొలంనేని మల్లికార్జున, జెట్టి చిరంజీవి, మండల జర్నలిస్ట్ యూనియన్ నాయకుడు బియ్యాల రమణ చిన్నఓరంపాడు క్రాస్ వద్ద ఉన్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్ కొండయ్య, శ్రీనివాసులుకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో విలేకరులు పాణ్యం చిన్నయ్య, కోవూరు శ్రీహరి, ఇసుకపాటి చంద్రశేఖర్, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

గాలివీడు: ఆదివారం అనంతపురం జిల్లా రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి చేయడం అనుమానుషమని మాజీ ఎంపీపీ వెంకటనారాయణరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు లక్ష్మయ్య ఒక ప్రకటనలో తెలిపారు. జర్నలిస్టులు ప్రజలకు, ప్రభుత్వానికి వారధులుగా ఉంటారని, నిరంతరం ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి ప్రయత్నం చేస్తుంటారని, అలాంటి వారిపైన వైసీపీ నాయకులు దాడి చేయడం మంచి పద్ధతి కాదన్నారు.

'ప్రలోభాలకు లొంగితే ఉద్యోగాలు పోతాయి'

● ఎన్నికల అధికారిణి బి. లీలారాణి

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 20: ఎన్నికల సమయంలో బూత్‌లెవల్ అధికారులు, సిబ్బంది ప్రలోభాలకు లొంగితే ఉద్యోగాలు పోతాయని రైల్వేకోడూరు ఎన్నికల అధికారిణి బి. లీలారాణి తెలిపారు. మంగళవారం రైల్వేకోడూరు తహసీల్దార్ కార్యాలయ సభా భవనంలో బూత్‌లెవల్ అధికారులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికలకు సంబంధించిన షెడ్యూల్ కొన్ని రోజుల్లో వస్తుందని అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు కృషి చేయాలన్నారు. సమస్యలు వచ్చినప్పుడు తమ దృష్టికి తీసుకుని రావాలన్నారు. ఇష్టానుసారంగా ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ అమరేశ్వరి, ఎన్నికల ఉప తహసీల్దారు ఏ. సిద్దేశ్వరరావు, బూత్‌లెవల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పుల్లంపేట: పుల్లంపేట మండలంలోని వత్తలూరు, అనంతసముద్రం, అప్పయ్యరాజుపేట, దళవాయిపల్లె, రెడ్డిపల్లె, అనంతయ్యగారిపల్లె గ్రామాల్లో నకిలీ ఓట్ల నమోదు చేశారంటూ తహసీల్దారు, కొమ్మనవారిపల్లె వీఆర్వోపై రాష్ట్ర చీఫ్ ఎలక్షన్ కమిషన్ అధికారికి అందిన ఫిర్యాదుపై మంగళవారం రైల్వేకోడూరు ఎలక్టోరల్ అధికారి లీలారాణి పుల్లంపేట తహసీల్దారు కార్యాలయంలో విచారణ చేశారు. ఫిర్యాదుదారులందరినీ పిలిపించగా, ఈ ఫిర్యాదుతో తమకు ఎటువంటి సంబంధం లేదని వివరించారు. ఆ మేరకు వారితో లిఖితపూర్వకంగా అంగీకారం తీసుకున్నారు.

పదవులున్నా, లేకున్నా ముస్లింలకు తోడుగా ఉంటా..

● మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



సర్కాజీ సర్ఫుద్దీన్ నివాసంలో ముస్లిం నేతలతో మాట్లాడుతున్న మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, ఫిబ్రవరి20: రాయచోటి ముస్లిం మైనార్టీలతో మండిపల్లి కుటుంబీకులు అన్నదమ్ముల్లాగా మెలుగుతామని, పదవులు ఉన్నా లేకున్నా వారికి తోడుగా ఉంటామని మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం రాయచోటి పట్టణంలోని మతగురువు సర్ఖాజీ సర్ఫుద్దీన్ ఇంట్లో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాయచోటి ముస్లింల ఆర్థిక, విద్యాభివృద్ధికి తాను ఎల్లవేళలా తోడుంటానన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం వస్తే ప్రతి సామాజిక వర్గానికి న్యాయం చేకూరే విధంగా కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ సర్ఖాజీ సోదరుడు హుస్సేని, మైనార్టీ నేతలు అమీర్, ఉస్మాన్, తాలిబ్, షంషీర్ తదితర ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

'టికెట్ ఇస్తారా.. రాజీనామాలు ఆమోదిస్తారా?'



విలేకర్ల సమావేశంలో మాట్లాడున్న ప్రభాకర్‌రెడ్డి, ఉమాపతిరెడ్డి

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 20: గత 15 ఏళ్లుగా టీడీపీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేసిన తమ నాయకుడికి రాయచోటి నియోజకవర్గ టికెట్ కేటాయించడంలో జాప్యం చేస్తున్నందుకు నిరసనగా మంగ ళవారం తెలుగుదేశం పార్టీకి రాజీనామా లు చేసినట్లు మార్కెట్ యార్డు ఛైర్మన్ కాలాడి ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎంపీపీ ఉమాపతిరెడ్డి తెలిపారు. మంగళవారం లక్కిరెడ్డిపల్లెలోని టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ 25 ఏళ్లుగా రెడ్డెప్పగారి రమేష్‌కుమార్‌రెడ్డి తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి ఎనలేని కృషి చేశాడన్నారు. అలాంటి నేతకు అన్యాయం జరుగుతుంటే భరించలేక మండల, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జీలందరూ రాజంపేట పార్లమెంటు అధ్యక్షుడు జగన్ మోహన్ రాజుకు రాజీనామాలు సమర్పించామన్నారు. అదిష్టానం విచారణ చేసి రాయచోటి అసెంబ్లీ టికెట్ రమేష్‌కుమార్డ్డికి ప్రకటించాలని లేని పక్షంలో రాజీనామాలు ఆమోదిం చాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ నాగేంద్రరెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, టీడీపీ బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి శంకారప్ప జయరాం, కోనంపేట సర్పంచు లక్ష్మినారాయణ, ధర్మరాజు, అంతుల్లా, రవిశంకర్‌రెడ్డి, బడుగు వాసుదేవుడు, రవి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు గంగయ్య, వెంకటరామరాజు, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్లోకి టీడీపీ సూపర్ సిక్స్



సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు వివరిస్తున్న టీడీపీ నాయకులు

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 20: ప్రజల్లోకి టీడీపీ సూపర్ సిక్స్ కార్యక్రమాన్ని తీసుకుపోతున్నట్లు రైల్వేకోడూరు మహిళా నాయకురాలు దుద్యాల అనితదీప్తి తెలిపారు. మంగళవారం రైల్వేకోడూరు పట్టణంలోని ఆంజనేయస్వామి గుడి వీధి, బలిజవీధి, చిన్నలాలాపేట తదితర వీధుల్లో సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ ప్రజా వ్యతిరేక కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వేకోడూరు పట్టణం అధ్యక్షుడు పోకల మణి, శాప్‌మాజీ డైరెక్టర్ దుద్యాల జయచంద్ర, నాయకులు ధనయాదవ్, మావిళ్ల రామయ్య, ఈశ్వర్‌యాదవ్, సంతోష్, కైలసాని శ్రీనివాసులు, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యానవర్సిటీలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 20: అన్ని దానాల కన్నా రక్తదానం మిన్న అని అనంతరాజుపేట ఉద్యాన యూనివర్సిటీ అసోసియేట్ డీన్ కే. గోపాల్ తెలిపారు. మంగళవారం రైల్వేకోడూరు మండలంలోని అనంతరాజుపేట ఉద్యాన యూనివర్సిటీలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు.33 మంది విద్యార్థులు రక్తదానం చేశారని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ వై. దీప్తికిరణ్, డాక్టర్ ఏ. నిశ్చల తెలిపారు. కడప రిమ్స్‌కు చెందిన వైద్యులు, సిబ్బంది రక్త సేకరణ చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీ ఫ్లెక్సీ ధ్వంసంపై నిగ్గు తేల్చాలి'



ధ్వంసమైన బీజేపీ ఫ్లెక్సీ

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 20: బీజేపీ ఫ్లెక్సీ ధ్వంసంపై నిగ్గుతేల్చాలని మండల బీజేపీ అధ్యక్షుడు నాగినేని బాల సుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. మంగళవారం బీజేపీ రైల్వేకోడూరు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ఓబుల వారిపల్లె మండలంలోని గాదెల పంచాయతీ తల్లంవారిపల్లెలో బీజేపీ ఫ్లెక్సీని సోమవారం రాత్రి కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని తెలిపారు. ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడిన వారిపై పోలీసులు వెంటనే చర్యలు తీసుకో వాలన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చేయాలన్నారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని రైళ్లకు స్టాపింగ్ ఇవ్వాలి



డీఆర్ఎంకు వినతిపత్రం ఇస్తున్న భరత్ కుమార్ రెడ్డి

ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 20 : డివిజన్ పరిధిలో మరిన్ని రైళ్లకు స్టా పింగ్‌లు ఇవ్వాలని గుంతకల్ రైల్వే బోర్డు మెంబర్ తల్లెం భరత్ కుమార్ రెడ్డి మంగళవారం గుంతకల్ రైల్వే డివిజన్ మేనేజర్ వినీత్‌సింగ్‌ని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సంద ర్భంగా రాజంపేట, నందలూరు, రైల్వేకోడూరులలో పలు ఎక్స్‌ప్రెస్‌లకు స్టాపింగ్‌లు ఇవ్వాలని కోరారు. రెడ్డిపల్లె, పుల్లంపేటలలో అరక్కోణం ప్యాసింజర్, ఇంటర్‌సిటీని నిలుపుదల చేయాలని, అలాగే ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య రామ మందిరానికి వెళ్లేందుకు వీలుగా రైళ్లను ఏర్పాటు చేయాలని కోరుతూ వినతిపత్రం అందించినట్లు వివరించారు.

రామాయణంపై అవగాహన పరీక్ష



పోటీ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

చిట్వేలి, ఫిబ్రవరి 20: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం రామాయణంపై పోటీ పరీక్ష నిర్వహించారు. అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు ఏబీఎస్ ప్రసాద్ ఆధ్వర్యంలో వేమన సాహితీపీఠం ఈ పరీక్ష నిర్వహించింది ఈ సందర్భంగా సాహితీపీఠం బాధ్యులు సుభాష్ చంద్రబోస్ (స్వామీజీ) మాట్లాడుతూ రామాయణం, భారతం, భాగవతం వంటి కావ్యాలు చదవడం వల్ల సనాతన భావాలు పెంపొందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు డాక్టర్ కె.స్వతంత్రబాబు, డి.నాగార్జున, విజయలక్ష్మి, సుహాసిని, సునీత, పెంచల్‌దాస్, శ్రీనివాస్, విశ్వనాథం, వెంకటసుబ్బయ్య, యుగంధర్ పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళన సమావేశాన్ని విజయవంతం చేయండి

రామాపురం, ఫిబ్రవరి 20: మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఎం. రమేశ్‌రెడ్డి ఇంట్లో బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించనున్న ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని లక్కిరెడ్డిపల్లె మాజీ ఎమ్మెల్యే ఆర్. రమేశ్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఆత్మీయ సమ్మేళన సమావేశానికి ఆర్ఆర్ బంధువులు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలన్నారు. మండలంలోని 13 గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న ఆర్ఆర్ బంధువులు, ఆత్మీయులు, కార్యకర్తలు హాజరు కావాలని ఆయన కోరారు.

మురుగు కాలువకు మరమ్మతులు చేయండి



పంచాయతీ కార్యదర్శి ప్రసాద్‌కు వినతిపత్రం ఇస్తున్న మల్లెం హేమంత్

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 20: పట్టణం లోని శ్రీకృష్ణా థియేటర్ పక్కనే ఉన్న డ్రైనేజీపై మూత దెబ్బతినడంతో రా త్రి వేళల్లో వృద్ధులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని టీడీపీ ఎన్ఆర్ఐ మల్లెం హేమంత్‌కుమార్ మంగళవారం తెలిపారు. ఈ వీధి నుంచి రంగనాయకులపేట, బృందావనం కాలనీ తదితర ప్రాంతాలకు ప్రజలు నిత్యం వెళుతుంటారన్నారు. సినిమా థియేటర్ పక్కనే ఉన్న వీధిలోకి వాహనాల రాకపోకలు సాగుతుంటాయన్నారు. వెంటనే విరిగిపోయిన డ్రైనేజి బండను తొలగించి కొత్తగా బండ ను వేయాలని కోరారు. ఈ మేరకు రైల్వేకోడూరు గ్రామ కార్యదర్శి ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు.

ఉత్తమ పలితాలు సాధిస్తే ఉజ్వల భవిష్యత్



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

లక్కిరెడ్డిపల్లె ఫిబ్రవరి 20: పరీక్షల్లో మంచి పలితాలు సాధిస్తే ఉ్వల భవిష్యత్ ఉంటుందని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కోమటిరెడ్డి శివశంకర్‌రెడ్డి తెలిపారు. ఏపీ మోడల్ స్కూల్ 11వ వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థుల వీడ్కోలు సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ గ్రామీణ విద్యార్థులకు ఏపీ మోడల్ స్కూల్ ఒక వరం లాంటిదన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ నాగయ్య, రాజ్‌కుమార్, శ్రీకళ, విజయ, నిత్యపూజయ్య, సుధాకర్, సుజాతమ్మ, అరుణకుమారి, విజయకుమారి, శ్రీనివాసులు, పిడి సోమశేఖర్ నాయక్, రసూల్, సుధీర్, రాజేశ్వరి, భారతి, ప్రసాదు, ఉమామహేశ్వరి, సురేష్, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు


గృహ నిర్మాణాలకు రూ.433 కోట్లు నిధులు

నందలూరు, ఫిబ్రవరి 20 : అన్నమయ్య జిల్లాలో 433 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో 79,540 గృహాలు మంజూరయ్యాయని జిల్లా గృహ నిర్మాణ శాఖ ఇన్‌చార్జి సహాయ సంచాలకులు ఎస్.వి.శివయ్య తెలిపారు. మంగళవారం మండలంలోని పాటూరు, తొగూరుపేట పంచాయతీ పరిధిలోని గృహ నిర్మాణాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహాలు మంజూరైనవారు ఎలక్షన్ కోడ్ వస్తే, బిల్లులు రావేమోనన్న అపోహలో ఉన్నారని, ఇల్లు మంజూరైన ప్రతి ఒక్కరికీ ఎలక్షన్ కోడ్‌తో సంబంధం లేకుండా బిల్లులు మంజూరవుతాయన్నారు. జిల్లాలో 31 వేల ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. ఇళ్ల నిర్మాణం పూర్తి చేసినా బిల్లులు మంజూరు కానివారు తమ ఆధార్ కార్డును వాట్సప్ ద్వారా పంపితే, బిల్లు స్టేటస్‌ను అప్పటికప్పుడే తెలియజేస్తామన్నారు. దళారులను నమ్మకుండా నేరుగా తనని సంప్రదించాలన్నారు.

సాఫ్ట్‌వేర్ రంగంలో క్లౌడ్ కంప్యూటింగ్ కీలకం

కురబలకోట, ఫిబ్రవరి 20: సాఫ్ట్‌వేర్ రంగంలో క్లౌడ్ కంప్యూటింగ్ కీలకమని రిసోర్సుపర్సన్ ఆనంద్ స్వరూప్‌కుమార్ తెలిపారు. మండలంలోని మిట్స్ ఇంజనీ రింగ్ కళాశాలలో మంగళవారం సీఎస్ఈ విభాగం ఆధ్వర్యంలో అమెజాన్ వెబ్ సర్వీసెస్‌తో క్లౌడ్ కంప్యూటింగ్‌పై 3రోజుల పాటు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధానంగా ఈ రంగానికి ఉజ్వల భవిష్యత్ ఉందని ఈ రంగంలో రాణిస్తే మెరుగైన ఉద్యోగావకాశాలను సాధించవచ్చన్నారు. ఇందు కోసం విద్యార్థులు ప్రధానంగా నైపుణ్యాలను మెరుగుపరచుకోవడంతో పాటుగా టెక్నాలజీలపై దృష్టి సారించాలన్నారు.

ఉమ్మడి చిత్తూరు, తిరుపతి జిల్లాల పరిధిలోని మెజారిటీ నియోజకవర్గాల్లో తాంబూలాలిచ్చేశాం తన్నుకు చావండి... అన్నట్టుగా మారింది అధికార పార్టీ తీరు. ఆశావహుల మధ్య, వర్గాల నడుమ సర్దుబాటు చేయకుండానే, సయోధ్య కుదర్చకుండానే ఇంఛార్జులను ప్రకటించేసింది. దీంతో ఆయా నియోజకవర్గాల్లో ఇంఛార్జుల ప్రకటనపై పార్టీ నేతలు, శ్రేణుల్లో అసంతృప్తి, అసమ్మతి సద్దుమణగపోగా మరింత ఎక్కువైంది. ఇంఛార్జుల ప్రకటనతో వర్గ విభేదాలు సర్దుకుంటాయని వైసీపీ అధిష్ఠానం వేసిన అంచనాలు దీంతో తలకిందులవుతు న్నాయి. కొన్ని స్థానాల్లో ఇంఛార్జుల స్వభావం సొంత పార్టీలోని వ్యతిరేక వర్గీయులతో అగాధం మరింత పెరిగిపోయేందుకు కారణమవుతోంది. వ్యతిరేకిస్తున్న వారిని కలుపుకునిపోయేందుకు ఏమాత్రం ప్రయత్నించకపోవడం లేదు. దీంతో విభేదిస్తున్న నేతల అహం దెబ్బతిని ఎన్నికల వేళ తీవ్ర పరిణామాలకు దారి తీస్తోంది.



తిరుపతి, ఆంధ్రజ్యోతి

తాంబూలాలిచ్చేశాం తన్నుకుచావండి!

- సర్దుబాటు చేయకుండానే వైసీపీ ఇంఛార్జుల ప్రకటన
- మెజారిటీ స్థానాల్లో వర్గ విభేదాలు... అసమ్మతులు

వెంకటగిరిలో ఆలస్యంగా వ్యతిరేకుల ఇళ్ళకు

వెంకటగిరిలో ఏడాది కిందటే ఇంఛార్జిగా నియమితులైనప్పటికీ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డికి నియోజకవవర్గంలో పార్టీపై పూర్తిగా పట్టు రావడం లేదు. సిట్టింగ్ ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డికి సన్నిహితులని భావించిన నాయకులందరినీ రామ్‌కుమార్‌రెడ్డి దూరం పెట్టారనే ఆరోపణలున్నాయి. ఇపుడు ఆనం పార్టీని వీడిపోయి, రామ్‌కుమార్‌రెడ్డికి లైన్ క్లియర్ అయినా కూడా ఆనం సన్నిహితులతో ఆయన సయోధ్య కుదుర్చుకోలేదు. దూరంగా వున్న నాయకులతో ఎన్నికల్లో నష్టం కలుగుతుందని భావించిన ఆయన తల్లి, మాజీ మంత్రి రాజ్యలక్ష్మి నేరుగా రంగంలోకి దిగి కుమారుడికి దూరంగా వున్న నాయకులను బుజ్జగించే ప్రయత్నం చేస్తున్నారు. పలువురు నాయకుల ఇళ్లకు వెళ్ళడంతో పాటు మరికొందరిని తన ఇంటికి ఆహ్వానించి కుమారుడికి ఎన్నికల్లో సాయం చేయాలని అభ్యర్థిస్తున్నారు. ఆమె పట్ల వారికి గౌరవం వున్నప్పటికీ వారు సర్దుకోలేకపోతున్నారు. రామ్‌కుమార్‌రెడ్డి వెళ్ళకుండా ఇంట్లో కూర్చుని వుంటే తామెందుకు మద్దతివ్వాలన్న ప్రశ్న వారి నుంచీ ఎదురవుతోంది. మొదటగా పోటీ చేయనున్న అభ్యర్థి వెళ్ళి సహకారం కోరితే తర్వాత ఆయన తరపు ఎవరు వెళ్ళినా ఇబ్బంది వుండేది కాదు.అలా కాకుండా రామ్‌కుమార్‌రెడ్డి బాగా ఆలస్యంగా మేల్కొని ఇపుడు ఎన్నికలు ముంచుకొచ్చాక వ్యతిరేకుల ఇళ్ళకు వెళుతున్నారు. దీంతో పార్టీలోని ఆయన వ్యతిరేకవర్గం సర్దుకునేందుకు సుముఖంగా లేరని సమాచారం.

గూడూరు ఎమ్మెల్యేతో పార్లమెంటు పరిధిలో నష్టం

గూడూరులో సిట్టింగ్ ఎమ్మెల్యేని పక్కన పెట్టి కొత్త ఇంఛార్జిగా ఎమ్మెల్సీ మేరుగ మురళీధర్‌ను వైసీపీ అధిష్ఠానం ప్రకటించేసింది. ఈ సందర్భంగా సిట్టింగ్ ఎమ్మెల్యే అభిప్రాయాలను ఏమాత్రం పరిగణనలోకి తీసుకోలేదు.కనీసం ప్రత్యామ్నాయం కూడా సూచించలేదు. ఐదేళ్ళు ఎంపీగా, ఐదేళ్ళు ఎమ్మెల్యేగా తాను సేవలందించిన పార్టీ నుంచీ ఈ రకమైన ధోరణి ఎదురుకావడం వరప్రసాదరావు మనసును కలచివేసినట్టు సమాచారం. దీంతో ఆయన తన పదేళ్ళ రాజకీయ నేపథ్యాన్నే అర్హతగా, ప్రామాణికతగా తీసుకుని జనసేన పార్టీ నుంచీ తిరుపతి ఎంపీగా పోటీ చేసేందుకు యత్నిస్తున్నారు.ఆయన తిరుపతి పార్లమెంటు పరిధిలో విస్తృతంగా పర్యటిస్తూ సన్నిహితులతో, పరిచయస్తులతో కలుస్తున్నారు. వారి మద్దతు కోరుతున్నారు. ఆయన కార్యకలాపాలు తెలుస్తున్నా వైసీపీ అధిష్ఠానం ఆయనతో సర్దుబాటుకు యత్నించడం లేదు. ఇది వరప్రసాదరావును, ఆయన సన్నిహితులను మరింత రెచ్చగొడుతోంది. దీంతో ఆయన రెట్టించిన పట్టుదలతో చాపకింద నీరులా జనసేనలో తన అవకాశాలను మెరుగుపరుచుకునేందుకు యత్నిస్తున్నారు. నిస్సందేహంగా ఇవి వైసీపీకి తిరుపతి పార్లమెంటులో, ప్రత్యేకించి గూడూరు సెగ్మెంట్‌లో నష్టం చేకూర్చే పరిణామాలే.

జీడీనెల్లూరులో సయోధ్యకు ఫలించని యత్నాలు

డిప్యూటీ సీఎంగా, సీఎం జగన్‌కు సన్నిహితుడిగా పేరున్నప్పటికీ నారాయణస్వామి టికెట్ విషయంలో అధిష్ఠానం నుంచీ అమర్యాదకర అనుభవాన్ని ఎదుర్కొన్నారు. నియోజకవర్గంలో పలువురు సొంత పార్టీ నాయకులు, పీఏలుగా వ్యవహరించిన రక్త సంబంధీకులు కూడా ఎదురు తిరిగారు. దీంతో అధిష్ఠానం ఆయన్ను చిత్తూరు ఎంపీ స్థానానికి ఇంఛార్జిగా బదిలీ చేసింది. ఆయన స్థానంలో చిత్తూరు ఎంపీని ఇంఛార్జిగా నియమించింది. వారం పదిరోజులకే మళ్ళీ నిర్ణయం మార్చుకుని వారిని వారివారి యథా స్థానాలకు తిరిగి ఇంఛార్జులుగా నియమించింది. తొలి ప్రకటనప్పుడు గానీ మలి ప్రకటనప్పుడు గానీ వర్గ విభేదాలు సర్దుబాటు చేసేందుకు అధిష్ఠానం యత్నించలేదు. నారాయణస్వామిని వ్యతిరేకిస్తున్నది ప్రధానంగా మాజీ ఎంపీ జ్ఞానేంద్రరెడ్డి. ఆయన కనుసన్నల్లోనే స్వామి వ్యతిరేకవర్గం కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. దీంతో జ్ఞానేంద్రరెడ్డితో సర్దుబాటు చేసుకునేందుకు స్వామి యత్నిస్తున్నారు. ఇటీవల సీఎం రాక సందర్భంగా రేణిగుంటలోని విమానాశ్రయంలో ఒకసారి, తర్వాత పెనుమూరులో వ్యవసాయ క్షేత్రంలో ఆయనతో మాట్లాడి సాయం చేయాలని అభ్యర్థించారు. అయితే క్షేత్రస్థాయిలో చేతులు కలిపేందుకు వ్యతిరేకవర్గం అంగీకరించడం లేదు. దీంతో నాయకుల చుట్టూ తిరగడం కంటే టికెట్ ప్రకటించాక నేరుగా జనం వద్దకే వెళ్ళి బతిమాలుకుంటానని నారాయణస్వామి సన్నిహితుల వద్ద వ్యాఖ్యానిస్తున్నట్టు సమాచారం. ఈ పరిణామంతో ఇరువర్గాల మధ్య విభేదాలు మరింత ముదురుతున్నాయి.

సైలెంటైన ముగ్గురు ఎమ్మెల్యేలు

చిత్తూరు సిట్టింగ్ ఎమ్మెల్యే శ్రీనివాసులును పక్కకు తప్పించి ఆర్టీసీ వైస్ ఛైర్మన్ విజయానందరెడ్డిని ఇంఛార్జిగా ప్రకటించిన ప్రారంభంలో అంతా బాగున్నట్టే అనిపించింది. గుడిపాల, చిత్తూరు రూరల్ మండలాల్లో ఎంచక్కా ఎమ్మెల్యేయే స్వయంగా అనుచరవర్గాలతో ఆత్మీయ సమావేశాలు పెట్టి విజయానందరెడ్డి గెలుపుకోసం సహకరించాలని కోరారు. అయితే రాజ్యసభ అభ్యర్థిత్వం విషయంలో అధిష్ఠానం నిర్ణయం మారిపోవడంతో ఒక్కసారిగా ఎమ్మెల్యే సైలెంట్ అయ్యారు. పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాలకు రెండింటికీ దూరమయ్యారు. రాజకీయంగా వేగంగా నిర్ణయాలు తీసుకుని విజయవంతంగా అమలు చేయడంలో సిద్ధహస్తుడైన ఎమ్మెల్యే శ్రీనివాసులు పైకి మౌనంగా వున్నట్టు కనిపించినా అంతర్గతంగా ప్రత్యామ్నాయం కోసం గట్టి ప్రయత్నాలే చేస్తుంటారన్న అనుమానాలు వైసీపీ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. పూతలపట్టులో కూడా సిట్టింగ్ ఎమ్మెల్యే ఎంఎస్ బాబును పక్కన పెట్టి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్‌ను ఇంఛార్జిగా నియమించారు. బహిరంగంగానే మంత్రి పెద్దిరెడ్డిపై ఆరోపణలు చేసిన ఎంఎస్ బాబు తర్వాత పొరపాటైందని ప్రకటించి మౌనవ్రతం పాటిస్తున్నారు. మకాం బెంగుళూరుకు మార్చారు. వైసీపీ, ప్రభుత్వ కార్యక్రమాలు రెండింటికీ హాజరు కావడం లేదు. అయనకు మద్దతు పలికిన నాయకులు, అనుచరులు కూడా ఇంఛార్జితో కలవడం లేదు. ఎమ్మెల్యే తరహాలో పార్టీ కార్యకలాపాలకు దూరంగా వుంటున్నారు. వీరిని కలుపుకునిపోయేందుకు పార్టీ పరంగా కూడా ప్రయత్నాలు జరగడం లేదు. దీంతో రెండు వర్గాల నడుమ అంతరం అలానే వుండిపోయి రోజులు గడిచే కొద్దీ పెరుగుతోంది. మదనపల్లెలో సిట్టింగ్ ఎమ్మెల్యే నవాజ్ బాషాను విస్మరించి నిషార్ అహ్మద్‌ను ఇంఛార్జిగా నియమించిన సంగతి తెలిసిందే. దీనిపై బహిరంగంగా ఒక్కమాట కూడా మాట్లాడకుండా ఎమ్మెల్యే నవాజ్‌బాషా తెరమరుగయ్యారు. పార్టీ కార్యక్రమాలతో పాటు చివరికి అధికారిక కార్యక్రమాలకు కూడా దూరమయ్యారు. మకాం బెంగళూరుకు మార్చారు. ఎన్నికల్లో ఆయన చురుగ్గా పనిచేసేలా అధిష్ఠానం యత్నించడం లేదు. జిల్లా నేతలు సైతం ఆయన్ను పట్టించుకోవడం లేదు.

సత్యవేడు వైసీపీలో మరింత గందరగోళం

సిట్టింగ్ ఎమ్మెల్యే ఆదిమూలాన్ని తిరుపతి లోక్‌సభకు ఇంఛార్జిగా బదిలీ చేసి ఆయన స్థానంలో తిరుపతి ఎంపీ గురుమూర్తిని సత్యవేడు ఇంచార్జిగా నియమించడంతో అంతర్గత పోరు రగులుకుని తారస్థాయికి చేరిన సంగతి తెలిసిందే. ఇపుడు ఆ నియోజకవర్గంలో అధికార పార్టీ మరింత గందరగోళ పరిస్థితిని ఎదుర్కొంటోంది. ఆదిమూలం తాను ఎంపీగా పోటీ చేయనని ప్రకటించడంతో పాటు టీడీపీలో చేరే క్రమంలో యువనేత నారా లోకేశ్‌ను కూడా కలిశారు. ఆదిమూలం తిరుగుబాటుతో తిరుపతి ఎంపీ గురుమూర్తిని తిరిగి తిరుపతి లోక్‌సభ ఇంఛార్జిగా నియమించిన అధిష్ఠానం సత్యవేడుకు మంత్రి పెద్దిరెడ్డి అనుచరుడైన నూకతోటి రాజేష్‌కుమార్‌ను ఇంఛార్జిగా ప్రకటించింది. మంత్రి పెద్దిరెడ్డి సత్యవేడు నియోజకవర్గ ముఖ్యులను తిరుపతిలో తన ఇంటికి పిలిపించుకుని రాజేష్‌ను పరిచయం చేశారు. ఆయన గెలుపుకోసం కృషి చేయాలని నిర్దేశించారు. మంత్రి ఎదురుగా వినయంగా చేతులు కట్టుకుని మరీ తలలూపి బయటకు వచ్చిన నాయకులు నియోజకవర్గం చేరగానే స్థానికులకే టికెట్ ఇవ్వాలన్న డిమాండ్ వినిపిస్తున్నారు. కేవీబీపురం మండల నేత డేవిడ్ తన మద్దతుదారులను వెంటబెట్టుకుని రాజేష్ సమక్షంలోనే ఎంపీ మిథున్‌రెడ్డిని కలసి టికెట్ కోరడం కలకలం రేపింది. బయటి వారిని తమపై రుద్దకుండా స్థానికులకే టికెట్ కేటాయించాలన్న డిమాండ్ ఊపందుకుంటున్నందున నియోజకవర్గంలో గందరగోళం నెలకొంటోంది. దీనివల్ల అభ్యర్థి విషయంలో మార్పులుంటాయన్న అంచనాలు కూడా మొదలవుతున్నాయి.

నగరి, సూళ్ళూరుపేటల్లో కుదరని సయోధ్య

నగరి, సూళ్ళూరుపేట నియోజకవర్గాల్లో వైసీపీ అధిష్ఠానం ఇంఛార్జులను మార్చకపోయినప్పటికీ సిట్టింగ్ ఎమ్మెల్యేల వర్గాలకు, వ్యతిరేక వర్గాలకు నడుమ సయోధ్య కుదరడం లేదు. నగరిలో మంత్రి రోజాయే తిరిగి పోటీ చేస్తారా లేక కొత్త అభ్యర్థి వస్తారా అన్నది తేలడం లేదు. రోజా సైతం బింకంగానే తప్ప ధీమాగా తానే పోటీ చేస్తానని చెప్పలేకపోతున్నారు. అదే సమయంలో ఆమెను వ్యతిరేకిస్తున్న పార్టీ నేతలతో మాట్లాడి రాజీ కుదిర్చే ప్రయత్నం ఏ స్థాయిలోనూ జరగడం లేదు. జిల్లాపై పట్టున్న ఓ మంత్రి నగరిలో జోక్యం చేసుకుంటున్నారని గతంలో అధిష్ఠానానికి ఫిర్యాదులు చేసిన నేపథ్యంలో ఇపుడా మంత్రి తానెందుకు పట్టించుకోవాలని ప్రశ్నిస్తున్నట్టు సమాచారం. దీంతో వ్యతిరేకవర్గాన్ని కలుపుకుని పోయే ప్రయత్నాలకు స్వస్తి పలికిన రోజా వారు కలిగించే నష్టాన్ని పూడ్చుకునేందుకు ప్రత్యామ్నాయం అన్వేషిస్తున్నారు. ఆ క్రమంలో రాజకీయాలకు దూరంగా వున్న వర్గాలను, ముఖ్యులను కూడా కలసి మద్దతు కోరుతున్నారు. ఆమె తీరు సొంత పార్టీలో వ్యతిరేక వర్గాన్ని మరింతగా రెచ్చగొడుతోంది. వారి మధ్య అగాధం మరింత పెరుగుతోంది. సూళ్ళూరుపేటలో సైతం టికెట్ విషయంలో సంజీవయ్యకు అధిష్ఠానం హామీ ఇచ్చినట్టు ప్రచారమవుతోంది. అయినా పార్టీలో వ్యతిరేకవర్గం రాజీ పడడంలేదు. సంజీవయ్యకు టికెట్ ఇస్తే ఓడిస్తామన్న శపథానికి కట్టుబడి అధిష్ఠానం ప్రకటన కోసం వేచి చూస్తున్నట్టు సమాచారం. అవసరమైతే టీడీపీ అభ్యర్థికి బహిరంగంగా కొందరు, లోపాయికారీగా కొందరు సహకరించే పరిస్థితి కనిపిస్తోంది. ఇక్కడ కూడా ఎమ్మెల్యేకి, వ్యతిరేక వర్గానికి నడుమ విబేధాలు తొలగించి దగ్గర చేసే ప్రయత్నం ఎవరూ చేయడం లేదు. మొత్తానికి కీలకమైన ఎన్నికల వేళ ఉమ్మడి చిత్తూరు, తిరుపతి జిల్లాల పరిధిలో 17 అసెంబ్లీ నియోజకవర్గాలకు గానూ తొమ్మిది నియోజకవర్గాల్లో అధికార పార్టీ పరిస్థితి అంతర్గత కలహాలతో దారుణంగా వుంది.

హుండీ కానుకలను శ్రీవారికి, భక్తులకే వినియోగించాలి

మాజీ మంత్రి అమరనాథ రెడ్డి



తిరుమల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి హుండీ కానుకలను భగవంతుడికి, భక్తుల కోసమే వినియోగించాలని టీటీడీని కోరుతున్నానని మాజీ మంత్రి అమరనాథరెడ్డి అన్నారు. అలా చేస్తేనే స్వామికి భక్తులు సమర్పించిన కానుకలకు అర్థం, పరమార్థం లభిస్తుందని చెప్పారు. శ్రీవారిని మంగళవారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. ఆయన మాటల్లోనే.. 'రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని స్వామిని కోరుకున్నా. అలా ఉండాలంటే ఏం చేయాలో నాకంటే భగవంతుడికే బాగా తెలుసు. పవిత్రమైన తిరుమలలో రాజకీయాలు మాట్లాడకూడదు. కేవలం గోవిందనామస్మరణే చేయాలి. రాజకీయాలు మాట్లాడటానికి చాలా ప్రదేశాలున్నాయి. ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి తిరుమలకు ప్రత్యేకత తీసుకొచ్చారు. ఆయన తర్వాత వచ్చిన ముఖ్యమంత్రులు కూడా దాన్ని పాటించారు. ఈ సంప్రదాయం రానురాను దిగజారే పరిస్థితి కనిపిస్తోంది. ప్రజలు దీన్ని గమనిస్తున్నారు. కొండపై రాజకీయాలు మాట్లాడటాన్ని వారి విజ్ఞతకే వదిలేస్తున్నా. ఈ విషయాన్ని అర్థం చేసుకుంటే భక్తి ఉందనుకోవాలి. అలాకాకుండా రాజకీయాలు మాట్లాడుతూనే ఉంటే భగవంతుడే చూసుకుంటాడు' అని అమరనాథరెడ్డి వివరించారు.

రూ.43.23 కోట్ల నీటి బిల్లులు విడుదల

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 20: జిల్లాలో పెండింగ్‌లో ఉన్న తాగునీటి ట్యాంకుల బిల్లులు రూ.43.23 కోట్లు విడుదలయ్యాయని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ విజయ్ కుమార్ మంగళవారం చెప్పారు. మొత్తం 8034 బిల్లులకు గాను ఈ మొత్తం విడుదలైందన్నారు. త్వరలోనే వీటిని ఆన్‌లైన్ చేసి కాంట్రాక్టర్లకు చెల్లిస్తామన్నారు.

బాలికపై యువకుడి అత్యాచారం

రామకుప్పం, ఫిబ్రవరి 20: రామకుప్పం మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికపై యువకుడు అత్యాచారానికి పాల్పడ్డాడు. తండ్రి పిలుస్తున్నాడంటూ ఆ బాలికను నమ్మించి.. ఆదివారం అటవీప్రాంతానికి తీసుకెళ్ళి అత్యాచారం చేశాడు. బాలిక కేకలతో స్థానికులు అక్కడకు చేరుకోవడంతో నిందితుడు పరారయ్యాడు. బాలిక తల్లిదండ్రులు సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడిని సోమవారం రాత్రి పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం : ఒకరి అరెస్టు



పోలీసులు స్వాధీనం చేసుకొన్న మద్యం ప్యాకెట్లతో నిందితుడు

తవణంపల్లె, ఫిబ్రవరి 20: కర్ణాటక మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి, రూ.1,06,000 విలువ గల మద్యం, రూ.5 లక్షల విలువైన కారును స్వాధీనం చేసుకొన్నట్లు చిత్తూరు డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి మంగళవారం తెలిపారు. మండలంలోని కాణిపాక పట్నం సమీపంలోని బెంగళూరు-తిరుపతి హైవే వద్ద సోమవారం సాయంత్రం తనిఖీలు చేపట్టామన్నారు. గుడిపాల మండలం వెప్పాలమానుచేను గ్రామానికి చెందిన ప్రకాష్ కుమారుడు ఉదయ్‌కుమార్(27) కారులో కర్ణాటక మద్యాన్ని చిత్తూరు వైపు తీసుకెళ్తూ తనిఖీల్లో పట్టుబడ్డాడన్నారు. అతడి నుంచి 35 బాక్సుల మద్యం బాటిళ్ళు, 1680 టెట్రా ప్యాకెట్లను, కారును స్వాధీనం చేసుకొని అరెస్టు చేసి రిమాండుకు పంపామన్నారు. ఉదయ్‌కుమార్‌పై ఇప్పటికే చిత్తూరు, చిత్తూరు తాలుకా, బైరెడ్డిపల్లె పోలీసు స్టేషన్లలో ఏడు కేసులు ఉన్నాయన్నారు. వెస్ట్ సీఐ రవిశంకర్‌రెడ్డి, తవణంపల్లె ఎస్ఐ సుధాకర్‌రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి



పరీక్షల నిర్వహణపై అధికారులతో సమీక్షిస్తున్న డీఆర్వో పుల్లయ్య

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 20: మార్చి ఒకటి నుంచి 20వ తేదీ వరకు ఇంటర్ పరీక్షలను అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని డీఆర్వో పుల్లయ్య ఆదేశించారు. ఇంటర్ పరీక్షల నిర్వహణపై మంగళవారం చిత్తూరులో నిర్వహించిన జిల్లాస్థాయి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని 50 కేంద్రాల్లో ఫస్టియర్ విద్యార్థులు 15,905 మంది, సెకండియర్ 16,852 మంది చొప్పున 32,757 మంది పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. దీనికి అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని, ఆయా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని పేర్కొన్నారు. పరీక్షా సమయానికి తగ్గట్టుగా ఆర్టీసీ బస్సులను నడపాలన్నారు. సమావేశంలో డ్వామా పీడీ రాజశేఖర్, ఇంటర్ బోర్డు అధికారి సయ్యద్ మౌలా, అన్ని శాఖల అధికారులు, ఇంటర్ బోర్డు అధికారులు, కలెక్టరేట్ పరీక్షల విభాగ సూపరింటెండెంట్ గుణశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

116 కేంద్రాల్లో టెన్త్ పరీక్షలు

మార్చి 18 నుంచి 30వ తేదీవరకు 116 కేంద్రాల్లో పదోతరగతి పరీక్షలు జరుగుతాయని డీఆర్వో పుల్లయ్య అన్నారు. మంగళవారం సాయంత్రం టెన్త్ పరీక్షలకు సంబంధించి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా 22,594 మంది పరీక్ష రాస్తున్నారన్నారు. వచ్చే నెల 5, 6 తేదీల్లో రానున్న ప్రశ్నపత్రాలను డీఈవో కార్యాలయం పక్కనున్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో భద్రపరచాలన్నారు. సమావేశంలో డ్వామా పీడీ రాజశేఖర్, డీఈవో దేవరాజుతో పాటు వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

బాలికల పట్ల హెచ్‌ఎం అసభ్య ప్రవర్తన

- గ్రామస్థుల ఆరోపణ

శాంతిపురం, ఫిబ్రవరి 20: శాంతిపురం మండలం తిమ్మరాజుపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు విద్యార్థినులపట్ల అసభ్యకర రీతిలో ప్రవర్తిస్తున్నారంటూ గ్రామస్తులు ఆరోపించారు. తమ పిల్లలు చెప్పడంతో కొద్ది రోజుల క్రితం వీరు ప్రధానోపాధ్యాయుడితో వాగ్వాదానికి దిగారు. దాడి చేసినట్లు సమాచారం. వారం కిందట ఎంఈవో చంద్రశేఖర్‌కు ఫిర్యాదు చేశారు. ఆ పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడిని పంపరాదని, అలా పంపితే పరిస్థితి సీరియస్‌గా ఉంటుందని హెచ్చరించారు. నాలుగు రోజుల తర్వాత మళ్లీ ప్రధానోపాధ్యాయుడు పాఠశాలకు వచ్చారు. దీంతో మంగళవారం ఓ కల్యాణ మండపంలో డీఈవో ఉన్నారని తెలుసుకున్న గ్రామస్థులు, అక్కడికి వెళ్లి ఫిర్యాదు చేయాలనుకున్నారు. అప్పటికే ఆయన వెళ్లిపోవడంతో బుధవారం చిత్తూరుకే వెళ్లి ఫిర్యాదు చేస్తామని చెప్పారు.

'ఉపాధి' పనుల్లో సొమ్మసిల్లి..

- మహిళా కూలీ మృతి



మృతిచెందిన రాజమణెమ్మ

విజయపురం, ఫిబ్రవరి 20: విజయపురం మండలం కాళికాపురంలో మంగళవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో ఉపాధి కూలీ రాజమణెమ్మ(60) మృతి చెందారు. సహచర కూలీలు తెలిపిన ప్రకారం.. స్థానిక సచివాలయ సమీపంలోని సప్లై చానల్‌లో ఉపాధి పనులు చేస్తుండగా రాజమణెమ్మ సొమ్మసిల్లి పడిపోయారు. మిగతా ఉపాధి కూలీలు ఆమెను పైకి తీసి సమీపంలోని చెట్టునీడకు చేర్చి ప్రథమ చికిత్స అందిస్తుండగా మృతి చెందారు. గుండె పోటుతో మృతి చెందారా, లేదా వడదెబ్బ కారణమా అనేది తెలియడం లేదని స్థానికులు చెప్పారు. ఏపీవో బబిత, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, వీఆర్వో వివేక్, మహిళా పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఆర్టీసీ వైస్ చైర్మన్‌గా హరి



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి20:ఆర్టీసీ వైస్ చైర్మన్‌గా శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన మిద్దెల హరి నియమితులయ్యారు.విజయానందరెడ్డి స్థానంలో ఈయన్ను నియమించారు. గతంలో ఆప్కో డైరెక్టర్‌గా, శ్రీకాళహస్తి పురపాలక సంఘం ఫ్లోర్ లీడర్‌గా హరి పనిచేశారు.

'పాలిసెట్'కు దరఖాస్తు చేసుకోండి

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 20: పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకోసం నిర్వహించే ఏపీ పాలిసెట్ ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ మంగళవారం నుంచి ప్రారంభమైంది. ఈమేరకు ఏపీ రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ నోటిఫికేషన్ వెలువరించింది. ఏప్రిల్ ఐదో తేదీలోపు దరఖాస్తులకు గడువు కాగా, అదేనెల 27న ఉదయం 11నుంచి మధ్యాహ్నం ఒంటిగంటవరకు పరీక్ష జరగనుంది. మే ఐదో తేదీన ఫలితాలను విడుదల చేయనున్నట్లు నోటిఫికేషన్‌లో పొందుపరిచారు. దరఖాస్తు కోసం హెచ్‌టీటీపీఎస్:// పాలిసెట్‌ఏపీ.ఎన్‌ఐసీ.ఇన్ వెబ్‌సైట్‌ని సంప్రదించాలి.

సమస్యలను పరిష్కరించకుంటే గుణపాఠం తప్పదు

కలెక్టరేట్ వద్ద ధర్నాలో ఏపీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి విజయ్‌కుమార్ హెచ్చరిక



ర్యాలీగా వస్తున్న ఏపీ జేఏసీ నేతలు

చిత్తూరు, ఫిబ్రవరి 20: ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే తగిన గుణపాఠం చెబుతామని ఏపీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి విజయ్‌కుమార్ హెచ్చరించారు. ఏపీ జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం చిత్తూరులోని పీవీకేఎన్ డిగ్రీ కళాశాల నుంచి ర్యాలీగా బయలుదేరి కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యలను ఈ ప్రభుత్వం పూర్తిగా గాలికొదిలేసిందన్నారు. నిరసనలు, ఆందోళనల రూపాల్లో సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఏపీ జేఏసీ జిల్లా అధ్యక్షుడు కేవీ రాఘవులు మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన వారంరోజుల్లో సీపీఎస్‌ను రద్దుచేస్తామని గొప్పలు చెప్పి మాట మార్చారని విమర్శించారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని డిమాండు చేశారు. పెన్షన్లు ఒకటో తేదీన మంజూరు చేసి అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్‌ను పునరుద్ధరించాలన్నారు. 12వ పీఆర్సీతో కూడిన 30 శాతం ఐఆర్‌ను మంజూరు చేయాలని, డీఏ బకాయిల విడుదల, జీపీఎఫ్, రిటైర్మెంట్ బెనిఫిట్స్, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులను వెంటనే చెల్లించాలన్నారు. హెల్త్‌కార్డులపై నగదు రహిత చికిత్స అందించాలని, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలను పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సమస్యలను పరిష్కరించాలని, లేదంటే తగిన గుణపాఠం చెప్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో ఎన్జీవో జిల్లా కార్యదర్శి వీజీ రఘు, జేఏసీ ప్రధాన కార్యదర్శి ముత్యాలరెడ్డి, నేతలు సోమశేఖర్ నాయుడు, మదన్‌మోహన్‌రెడ్డి, చెంగల్రాయమందడి, వివిధ తాలూకాల నుంచి అధ్యక్ష, కార్యదర్శులు, ఉద్యోగులు, కార్మికులు, పెన్షనర్లు పాల్గొన్నారు.



ధర్నాలో మాట్లాడుతున్న ఏపీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి విజయ్‌కుమార్

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి అమానుషం

● దాడి చేసిన రౌడీ మూకలను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలి ● పత్రికా స్వేచ్ఛను కాపాడాలి ● ధర్నాలో అఖిలపక్ష నేతలు



ములకలచెరువు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అఖిలపక్ష నాయకులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు



కురబలకోట సమావేశంలో మాట్లాడుతున్న రాజంపేట పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు పి.సురేంద్రయాదవ్ తదితరులు

ములకలచెరువు, ఫిబ్రవరి 20: అనంతపురం జిల్లా రాప్తాడులో జరిగిన వైసీపీ సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి అమానుషమని దాడికి పాల్పడిన రౌడీ మూకలను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని అఖిలపక్ష నేతలు డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడికి నిరసనగా మంగళవారం బీఎస్పీ, సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి సిద్ధిగాళ్ల ప్రసాద్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సలీంబాషా, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డి, సీపీఐ మండల కార్యదర్శి అంజనప్ప మాట్లాడుతూ ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై విచక్షణారహితంగా వైసీపీ గుండాలు దాడి చేయడం దారుణమన్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చినప్పటికి నుంచి పాత్రికేయులపై దాడులు జరుగుతున్నాయన్నారు. మీడియా రక్షణకు ప్రత్యేక చట్టాలను తీసుకు రావాలన్నారు. ప్రతి ఒక్కరు పిడికిలి బిగించి అరాచక వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపాలని వారు పిలుపునిచ్చారు. రాబోవు రోజుల్లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు చేపట్టాన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ హరికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరసింహ, రమణ, సోము, అంజి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పత్రికా స్వేచ్ఛను హరిస్తున్న వైసీపీకి బుద్ధి చెప్పడం ఖాయం

పత్రికా స్వేచ్ఛను హరిస్తున్న వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, రాజంపేట పార్లమెంటు నియోజకవర్గ కార్యనిర్వాహక కార్యదర్శి యర్రగుడి సురేష్‌లు పేర్కొన్నారు. ములకలచెరువులో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాప్తాడులో జరిగిన వైసీపీ సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకలు విచక్షణారహితంగా, పైశాచికంగా దాడి చేయడం దారుణమన్నారు. దాడి చేసిన వైసీపీ గుండాలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. నిజాలు నిర్భయంగా రాసే పత్రికలు, పాత్రికేయులపై వైసీపీ ప్రభుత్వంలో దాడులు జరగడం దుర్మార్గమన్నారు. ఈ సమావేశంలో మహిళా కార్యనిర్వాహక కార్యదర్శి గంగాదేవి, నాయకులు భజంత్రి రామాంజులు, వెంకటసిద్ధయ్య, మూగి రవిచంద్ర, భాస్కర్‌రెడ్డి, రషీద్, కుళాయప్ప, వేణుగోపాల్, వెంకటరమణ, శంకర, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

కురబలకోట, ఫిబ్రవరి 20: అనంతపురం జిల్లా రాప్తాడులో సీఎం జగన్ నిర్వహించిన సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి చేసిన వైసీపీ రౌడీలను కఠినంగా శిక్షించాలని రాజంపేట పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు పి.సురేంద్రయాదవ్ డిమాండ్ చేశారు. మండలంలోని అంగళ్లులో సురేంద్రయాదవ్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో నిజాలను ప్రజలకు తెలియజేసే బాధ్యత జర్నలిస్టులకు ఉందని, అలాంటి వారిపై అమానుషంగా దాడి చేయడం దుర్మార్గమన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పాత్రికేయులపై వైసీపీ ప్రభుత్వ హయాంలో దాడులు ఎక్కువయ్యాయన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పోలీసులు విఫలమయ్యారని ఆరోపించారు. ఇలాంటి ధోరణి మానుకోవాలని, రానున్న ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో రాజంపేట పార్లమెంటరీ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి అయూబ్‌బాషా, పార్లమెంటరీ బీసీ సెల్ అధికార ప్రతినిధి సదాశివ, రవియాదవ్, వెంకటరమణారెడ్డి, రామచంద్ర, మోహన్‌రెడ్డి, దామోధర్‌రెడ్డి, మునింద్ర, తెట్టు ఉపసర్పంచ్ బి.భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నిమ్మనపల్లిలో: అనంతపురం జిల్లా రాప్తాడులో జరిగిన బహిరంగ సభలో ఫొటోలు తీస్తున్న ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ కృష్ణపై వైసీపీ మూకలు దాడి చేయడాన్ని టీడీపీ జిల్లా బీసీ సాధికార సమితి కన్వీనర్ లక్ష్మన్న తీవ్రంగా తప్పుపట్టారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పత్రికా విలేకరులకు కూడాస్వేచ్ఛలేక పోతే సామాన్యుల పరిస్థితి ఏంటని ఆయన అన్నారు. ఇది కేవలం ఆంధ్రజ్యోతి పత్రికపై కక్ష పూరితంగా జరిగిందని, దాడి చేసింది ఎంతటి వారైనా ఖచ్చితంగా అరెస్టు చేయాలన్నారు. నిందితులను అదులోకి తీసుకోక పోవడాన్ని పోలీసుల వైఫల్యమే అని అన్నారు. ఇలాంటి దుర్మార్గపు చర్యకు పాల్పడిన వారిని టీడీపీ వదలి పెట్టదని హెచ్చరించారు. వైసీపీ ప్రభుత్వాని కేవలం 50రోజులే గడువు వుందని తరువాత టీడీపీ ప్రభు త్వ అధికారంలోకి రాగానే వైసీపీ తగిన మూల్యం చెల్లించక తప్పదన్నారు.

చంద్రబాబుతోనే భవిష్యత్తుకు గ్యారంటీ



వాల్మీకిపురంలో ఇంటింటా కరపత్రాలు పంచుతూ ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

వాల్మీకిపురం, ఫిబ్రవరి 20: టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ సీఎం నారా చంద్రబాబు నాయుడితోనే రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకి గ్యారంటీ అని వాల్మీకిపురం మండల టీడీపీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక వాల్మీకినగర్, బీడీ కాలనీ, ఎన్‌టీఆర్ కాలనీ, రామ్‌నగర్ తదితర ప్రాంతాలలో పార్టీ నాయకులు, కార్యకర్తలు టీడీపీ-జనసేన మేనిఫెస్టో సూపర్ సిక్స్ సంక్షేమ పథకాల పట్ల కరపత్రాలు పంచుతూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షస పరిపాలన కొనసాగుతోందన్నారు. సీఎం జగన్ మళ్లీ ఎన్నికల ముందు కళ్లబొల్లి మాటలతో మభ్యపెట్టాలని చూస్తే నమ్మేవారెవరూ లేరన్నారు. 2019 ఎన్నికల ముందు రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని వారు ప్రశ్నించారు. రాబోవు ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి పరాభవం తప్పదని, ప్రజలు కూడా జగన్‌ను ఇంటికి సాగునంపడానికి సంసిద్ధులయ్యారన్నారు. కార్యక్రమంలో పీలేరు తెలుగు యువత ఉపాధ్యక్షుడు లంకిపల్లి మధు, మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్, నాయకులు రాజేంద్రాచారి, పీవీ నారాయణ, చంద్రమౌళి, డిష్ బ్రదర్స్, కోసూరి రమేష్, స్వర్ణలత, మురళి, న్యాయవాది రమణ, కువైట్ సయ్యద్‌బాషా, బొక్కసం ఆనంద్, చాను, రామాంజులురెడ్డి, సాదిక్, సర్దార్, మౌలా, సైదు, బషీర్, రమణ, అబ్బాస్, సయ్యద్, అమీర్, లోకేష్, మస్తాన్ వలి, ఆదినారాయణ, రెడ్డిరామ్, తదితరులు పాల్గొన్నారు.

కేవీ పల్లె మండలం నుంచి పలువురు టీడీపీలో చేరిక



కిశోర్‌కుమార్ రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరుతున్న కేవీ పల్లె వాసులు

కలికిరి, ఫిబ్రవరి 20: కేవీ పల్లె మండలంలోని తీతవగుంటపల్లె పంచాయతీకి చెందిన పలువురు వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. మంగళవారం నగరిపల్లెలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి సమక్షంలో వారు పసుపు కండువాలు వేసుకుని టీడీపీలో చేరుతున్నట్లు ప్రకటించారు. వారందరినీ పార్టీలోకి ఆహ్వానిస్తూ టీడీపీ బలోపేతం కావడానికి కృషి చేయాలని నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి కోరారు. పార్టీలో అందరికీ సముచిత స్థానం ఉంటుందని హామీ ఇచ్చారు. నియోజకవర్గం అభివృద్ధి కోసం కలిసి కట్టుగా పనిచేద్దామన్నారు. మఠంపల్లె, గ్యారంపల్లె మాజీ సర్పంచులు దూళ్ల నారాయణ, వెంకట్రమణారెడ్డి ఆధ్వర్యంలో తుమ్మల జయశంకర నాయుడు, పెద్ద వెంకట్రమణ, చిన్న వెంకట్రమణ, సురేంద్ర, సుందర, నాగార్జున, నారే వెంకట్రమణ, సప్పడి నాగమల్లయ్య, సప్పడి శంకర, తుమ్మల నాగమల్లయ్య, ఎం.కుమార్ తదితరులు పార్టీలో చేరిన వారిలో వున్నారు.

గర్భిణిని ఆదుకున్న హెల్పింగ్ మైండ్స్ సంస్థ సభ్యులు



గర్భిణితో విషయాలు తెలుసుకుంటున్న హెల్పింగ్‌మైండ్స్ సభ్యులు

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 20: దివ్యాంగురాలైన గర్భిణికి చిరుసహాయంతో కొండంత భరోసా హెల్పింగ్‌మైండ్స్ సంస్థ సభ్యులు కల్పించారు. నిండుగర్భంతో ఉన్న భార్యను భర్త బస్టాండ్‌లో వదిలి వెళ్లిన సంఘటన సోమవారం రాత్రి బి.కొత్తకోటలో వెలుగు చూసింది. కర్ణాటక రాష్ట్రం చేలూరు సమీపంలోని బాగేపల్లికి చెందిన వెంకటేష్ నిండు గర్భంతో ఉన్న దివ్యాంగురాలైన భార్య గంగ (35)ను తీసుకువచ్చి బి.కొత్తకోట బస్టాండ్‌లో మూడు రోజుల క్రితం వదిలి వెళ్లిపోయాడు. భర్త ఎంత సమయానికి రాకపోవడంతో ఆమె కన్నీటి పర్యంతమైంది. బాధితురాలిని బి.కొత్తకోట బీసీ కాలనీకి చెందిన ఆశావర్కర్ భారతి 108 వాహనంలో తీసుకొచ్చి మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో చేర్పించింది. డాక్టర్లు ఆమెను పరీక్షిం చి కడుపులో కవల పిల్లలు ఉన్నట్లు నిర్ధారించారు. ఈ సందర్భంగా మంగళవారం మదనపల్లెకు చెందిన హెల్పింగ్‌మైండ్స్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు అబూబక్కర్ సిద్ధిక్ సభ్యులు దినకర్, ఇలియాజ్, కిరణ్‌లతో కలిసి జిల్లా ఆస్పత్రి ప్రసూతి వార్డులో ఉన్న గంగతో మాట్లాడి సంస్థ ఆధ్వర్యంలో పదివేలు ఆర్థిక సాయం అందించారు. ప్రసవ సమయంలో ఇబ్బందులు పడకుండా బట్టలు, ఇతర సామగ్రి మూడు పూటల భోజన వసతి కల్పించారు. హెల్పింగ్ మైండ్స్ నిర్వాహకుడు అబూబక్కర్ సిద్ధిక్ మాట్లాడుతూ ప్రసూతి సమయంలో గంగకు హెల్పింగ్‌మైండ్స్ అండగా ఉంటుందన్నారు.

మదనపల్లె ఆర్టీసీ వన్‌డిపో రీజియన్‌లో ఫస్ట్



గేట్‌మీటింగ్‌లో మాట్లాడుతున్న వన్ డిపోమేనేజరు వెంకటరమణారెడ్డి

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 20: మదనపల్లె ఆర్టీసీ వన్‌డిపో అధిక కేఎంపీఎల్, ఈకేపీ సాధించి రీజయన్‌లో మొదటి స్థానం సాధించిందని వన్‌డిపో మేనేజరు మూరే వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం డిపో ఆవరణలో ఆర్టీసీ ఉద్యోగులకు డీఎం గేట్‌మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన్‌డిపో రీజయన్‌లో మొదటిస్థానం సాధించినందులకు ఉద్యోగులు, సిబ్బంది ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఇదేస్ఫూర్తితో ప్రతి ఒక ఉద్యోగి సమయపాలన పాటిస్తూ ఉద్యోగం నిర్వహించాలని ఆయన సూచించారు. డిపోలో అధిక కేఎంపీఎల్, ఈకేపీ సాధించిన ఉద్యోగులను ఈసందర్భంగా అభినందించారు. ఆర్టీసీ ఉద్యోగులు డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ మాట్లాడరాదని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజరు రేవతి, గ్యారేజ్, రూట్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ రంగంలో క్లౌడ్ కంప్యూటింగ్ కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న రిసోర్సుపర్సన్ స్వరూప్‌కుమార్

కురబలకోట, ఫిబ్రవరి 20: సాఫ్ట్‌వేర్ రంగంలో క్లౌడ్ కంప్యూటింగ్ కీలకమని రిసోర్సుపర్సన్ ఆనంద్ స్వరూప్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం సీఎస్ఈ విభాగం ఆధ్వర్యంలో అమెజాన్ వెబ్ సర్వీసెస్‌తో క్లౌడ్ కంప్యూటింగ్‌పై 3రోజుల పాటు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధానంగా ఈ రంగానికి ఉజ్వల భవిష్యత్ ఉందని ఈ రంగంలో రాణిస్తే మెరుగైన ఉద్యోగావకాశాలను సాధించవ చ్చన్నారు. ఇందు కోసం విద్యార్థులు ప్రధానంగా నైపుణ్యాలను మెరుగుపరచుకోవడంతో పాటుగా టెక్నాలజీలపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రామనాథమ్, విభాగాధిపతి కల్పన, కో ఆర్డినేటర్ అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే గ్రామ స్వరాజ్యం సాధ్యం



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

నిమ్మనపల్లి, ఫిబ్రవరి 20: కాంగ్రెస్ పార్టీతోనే గ్రామ స్వరాజ్యం సాధ్యమని మదనపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, రాష్ట్ర ఓబీసీ స్పోక్స్ పర్సన్ శ్రీధర్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక బస్టాండులోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో అన్ని వర్గాలవారు తీవ్రంగా నష్ట పోయారన్నారు. ఐదేళ్లుగా కార్పొరేషన్ రుణాలను రద్దు చేయడం వలన యువత ఎంతో నష్టపోయారని దీనికి తోడు ఉద్యోగాలు భర్తీ చేయకుండా యువతను నట్టేట ముంచారన్నారు. ప్రస్తుతం మండల ప్రజలు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రజా సమస్యలను తీర్చుతామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సింగం రామకృష్ణారెడ్డి, శ్రీదేవి, పవన్‌కుమార్, దారాపారేసి పాల్గొన్నారు.

వివాహ రిసెప్షన్ వేడుకలకు హాజరైన నల్లారి

కలికిరి, ఫిబ్రవరి 20: కలికిరి మేజర్ పంచాయతీ సర్పంచు రెడ్డివారి ప్రతాప్‌కుమార్ రెడ్డి కుమారుడి వివాహ రిసెప్షన్ వేడుకలకు మంగళవారం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి హాజరయ్యారు. స్థానిక కల్యాణ మండపంలో జరిగిన ఈ వేడుకలకు నూతన వధూవరులు యోగేష్, లావణ్యలను ఆయన ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమానికి వివిధ పార్టీలకు చెందిన పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

నేడు అంగళ్లులో ఉరుసు

కురబలకోట, ఫిబ్రవరి 20: మండలంలోని అంగళ్లులో రెండు రోజుల పాటు హజ్రత్ సయ్యదినా షేక్ అబ్దులాఖాదర్ జిలానీ పీరానెపీర్ గౌసుల్ అజం దస్తగీర్ ఉరుసు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బుధవారం రాత్రి గంధోత్సవం గురువారం ఖవ్వాలి నిర్వహిస్తారని, భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

గట్టు కొండకు నిప్పు.. రెండు హెక్టార్లలో అటవీ ప్రాంతం దగ్ధం

బి.కొత్తకోట,ఫిబ్రవరి20: బి. కొత్తకోట మండల పరిధిలోని గట్టు గ్రామ శివారులోని కొండప్రాంతానికి మంగళవారం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. దీంతో ఇంతకాలం పచ్చగా ఉన్న సుమారు 2హెక్టార్ల అటవీప్రాంతం అగ్నికి ఆహుతి అయింది. ప్రతి యేడాది వేసవి ప్రారంభంలో ఈ అటవీప్రాంతానికి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడం పరిపాటిగా మారిందని స్థానికులు ఆరోపిస్తురు. ఈ ప్రాంతం హార్స్‌లీహిల్స్ సెక్షన్ పరిధిలోకి వస్తుంది. ఈ సంఘటనపై సమాచారం అందినప్పటికీ మంటలను అదుపు చేసే అవకాశం లేక అటవీశాఖ అధికారులు సకాలంలో స్పందించడానికి వీలులేకుండా పోయింది.

మతిస్థిమితం లేని వివాహిత అదృశ్యం



అదృశ్యమైన నారె సుధా

రామసముద్రం, ఫిబ్రవరి 20: రామసముద్రం మండలంలో మతిస్థిమితంలేని వివాహిత అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. మండంలోని చెంబకూరు గ్రామ పంచాయతీ ఇందిరానగర్ కాలనీలో నివాసం ఉండే నారె రామనాథ్‌రెడ్డి భార్య నారె సుధ(44) గత శుక్రవారం ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు భర్త మంగళవారం ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. తన ఇద్దరు కుమారుల అకాల మరణం చేత తన మానసిక స్థితి సక్రమంగా లేనందున అప్పుడప్పుడు ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయేదని గతంలో కూడా పలుమార్లు సుధ ఇంటి నుంచి వెళ్లిపోగా ఆమెను వెతికి ఇంటికి పిలుచుకుని రావడం జరిగిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే ఈ సారి బంధువుల ఊర్లకు వెళ్లి విచారించినా ఆమె ఆచూకీ తెలియడం లేదని భర్త రామనాథ్‌రెడ్డి ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇంటి స్థలం విషయమై గొడవ... 8 మందిపై కేసు నమోదు

గుర్రంకొండ, ఫిబ్రవరి 20:ఇంటి స్థలం విషయమై ఇరువర్గాలు ఘర్షణ పడడంతో 8 మందిపై కేసు నమోదు చేసినట్లు రెండవ ఎస్ఐ శ్రీనివాస్‌నాయక్ తెలిపారు. ఆయన వివరాల మేరకు మండలంలోని రామాపురం పంచాయతీ నక్కలవారిపల్లెకు చెందిన ఇ.వెంకటరమణ(47)కు అదే గ్రామానికి చెందిన ఎం.నరేష్ బాబు(35)కు ఇంటి స్థలం విషయమై కొంత కాలంగా గొడవ లున్నాయి. ఈ క్రమంలో స్థలంలో మంగళవారం వెంకటరమణ కూసాలు నాటుతుండగా నరేష్‌బాబు కుటుంబ సభ్యులు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాలు ఘర్షణ పడ్డారు. ఈ గొడవలో వెంకటరమణ, యల్లప్పలకు రక్తగాయాలయ్యాయి. ఇ.వెంకటరమణ ఫిర్యాదు మేరకు ఎం.నరేష్‌బాబు, సుబ్బరాజు, జయతులసీ, సునీల్‌కుమార్‌లపై కేసు నమోదు చేశామన్నారు. అలాగే ఎం.నరేష్‌బాబు ఫిర్యాదు మేరకు ఇ.వెంకటరమణ, ఇంద్రావతి, యల్లప్ప, భారతిలపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. గతంలో ఇరువర్గాలు గొడవ పడకుండా బైండోవర్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

చైతన్య సేవా సంస్థ ఆధ్వర్యంలో వృద్ధురాలికి దహన సంస్కారాలు

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 20: పట్టణంలోని దేవతానగర్‌లో ఉన్న చైతన్య సేవా సంస్థలో ఆశ్రయం పొందుతున్న ఎన్ఎం లక్ష్మీకుట్టి (83) అనాథ వృద్ధురాలికి మంగళవారం చైతన్య సేవా సంస్థ ఆధ్వర్యంలో దహన సంస్కారాలు చేశారు. కేరళవాస్తవ్యులు వృద్ధ దంపతులైన ఎన్ఎం కృష్ణకట్టినాయర్ (85)ఎన్ఎం లక్ష్మీకుట్టి గత పదేళ్లగా ఆశ్రమంలో సేవలు అందుకుంటున్నారు. వారికి నలుగురు పిల్లలు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు, ఇందులో కుమారుడు యాక్సిడెంట్‌లో చనిపోగా, ఆడపిల్లలకు వివాహాలు జరిగి ఎక్కడవాళ్లు అక్కడ స్థిరపడ్డారు. ఎవ్వరూ పట్టించుకోకపోవడంతో చైతన్య స్వచ్ఛంద సేవాసంస్థ వారికి ఆశ్రయం ఇచ్చింది. చైతన్య స్వచ్ఛం ద సేవాసంస్థ నిర్వాహకుడు ఎంపీఆనందన్ మంగళవారం మదనపల్లెలో అంత్యక్రియలు నిర్వహించారు. ఇందులో కవితారాణి, కృష్ణచరణ్, ఆశ్రమ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి పట్టాల పంపిణీ

బి.కొత్తకోట,ఫిబ్రవరి20: బి కొత్తకోట నగరపంచాయతీ కార్యాలయ ఆవరణలో మంగళవారం ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి సుమారు 1000 మంది లబ్ధిదారులకు ఇంటి పట్టాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ పీఎస్ మనోహర్, ఎంపీపీ లక్ష్మీనరసమ్మ, జడ్పీటీసీ రామచంద్ర, తహశీల్దార్ పుణ్యవతి, ఎంపీడీవో నూర్జహాన్, మాజీ ఎంపీపీ ఖలీల్, మాలిక్, ప్రదీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు కలికిరి మండల సమావేశం

కలికిరి, ఫిబ్రవరి 20: కలికిరి మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రామకృష్ణయ్య తెలిపారు. ఎంపీపీ నూర్జహాన అధ్యక్షతన ఉదయం 11 గంటలకు జరిగే సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచులు, అన్ని మండల స్థాయి శాఖల అధికారులు నివేదికలతో రావాలని ఎంపీడీవో కోరారు.

కోర్టు వాయిదాకు హాజరైన టీడీపీ నాయకులు



కోర్టు వాయిదాకు హాజరై వస్తున్న టీడీపీ నాయకులు

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 20: కోర్టు వాయిదాకు టీడీపీ నాయకులు మంగళవారం హాజరయ్యారు. 2021 సంవత్సరంలో విద్యార్థిని రమ్య హత్య కేసులో బాధితురాలి కుటుంబానికి న్యాయం చేయాలని మదనపల్లెలో టీడీపీ నాయకులు పోలీసుస్టేషన్ ఎదుట ధర్నా చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో అప్పట్లో పోలీసులు 14 మందిపై కేసులు నమోదు చేశారు. ఈ క్రమంలో మంగళవారం ఈ కేసు విషయమై తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు, అరుణ్‌తేజ, విజయమ్మ శ్రీనాథరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, పఠాన్‌ఖాదర్‌ఖాన్, అయూబ్, బావాజాన్, శివ, సిద్దు, ప్రణయ్, ముక్తియార్‌లు కోర్టు వాయిదాకు హాజరయ్యారు.

టైలరింగ్ కోర్సుకు రిజిస్ట్రేషన్ చేసుకోండి

తంబళ్లపల్లె, ఫిబ్రవరి 20: తంబళ్లపల్లె ప్రభుత్వ ఐటీఐలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్‌లో ఉచిత టైలరింగ్ కోర్సుకు ఆసక్తి గల వారు పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ప్రిన్సిపాల్ రవంద్రారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ టైలరింగ్ కోర్సు మూడు నెలల పాటు ఉంటుందన్నారు. టైలరింగ్ కోర్సు పైన మూడు నెలలు శిక్షణ పొంది ఉపాధి అవకాశాలు కల్పించుకోవచ్చన్నారు. ఆసక్తి గల యువతీ, యువకులు ఈ నెల 28వ తేదీ లోగా పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు స్కిల్ హబ్ కోఆర్డినేటర్ చౌడయ్య నెం:9618655759 సంప్రదించాలని కోరారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కలికిరి, ఫిబ్రవరి 20: మండలంలోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని కలికిరి ఎస్పీడీసీఎల్ డీఈఈ శ్రీనివాసులు, ఏఈఈ ముజిబుర్ రహ్మాన్ ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగు లేన్ల జాతీయ రహదారి పనుల్లో భాగంగా కలకడ మార్గంలో 220 విద్యుత్ లైన్‌కు కొత్త విద్యుత్ టవర్లు ఏర్పాటు చేయాల్సి ఉన్నందును విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు చెప్పారు. దీని కారణంగా కలికిరి 220 కేవీ సబ్ స్టేషన్ పరిధిలోని సన్యాసివారిపల్లె, ఇందిరమ్మకాలనీ ఫీడర్లతోపాటు, నగరిపల్లె, సీఆర్‌పీఎఫ్, తెల్లగుట్ట దళితవాడ, కలికిరి క్రాస్‌రోడ్డు, హేమాచారి కల్యాణ మండపం నుంచి కురవపల్లె రోడ్డు వరకూ ఉన్న ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ సరఫరా పూర్తి ఉండదని, అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని వారు కోరారు.

స్ట్రాంగ్ రూమ్ మరమ్మతుల్లో వేగం పెంచాలి



జడ్పీహైస్కూల్లో స్ట్రాంగ్‌రూమ్ వద్ద సూచనలిస్తున్న ఆర్డీవో హరిప్రసాద్

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 20: మదనపల్లె జడ్పీ హైస్కూల్లో ఏర్పాటు చేయనున్న స్ట్రాంగ్ రూమ్‌ల మరమ్మతు పనులు వేగం పెంచాలని ఆర్డీవో హరిప్రసాద్ సూచించారు. మంగళవారం స్థానిక జడ్పీహైస్కూల్లో స్ట్రాంగ్ రూమ్ వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఎన్నికల ముందు రోజు స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరచిన ఈవీఎంలు, వీవీ ప్యాట్ యంత్రాల పంపిణీ ఒక వైపు చేయాలన్నారు. ఎన్నికలు ముగిశాక తిరిగి ఇక్కడికి చేరుకునే ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లను స్ట్రాంగ్ రూమ్‌లో ఎలా భద్రపరచాలో వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, సర్వేయర్ సుబ్రమణ్యం, ఈ డీటీ అస్లాం తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

కలకడ, ఫిబ్రవరి 20:మండలంలోని గంగాపురం పంచాయతీ బాహుదా నది ఒడ్డున ఉన్న కోటి లింగేశ్వరాలయంలో గురువారం నుంచి శనివారం వరకు విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందులో భాగంగా మహా గణపతి, నందీశ్వర, సూర్య, చంద్ర గ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. అలాగే మూడు రోజుల పాటు వివిధ పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని వారు కోరారు.


బీసీ సంఘం అధ్యక్షుడిగా దేవరింటి కుమార్

బి. కొత్తకోట, ఫిబ్రవరి20: బి.కొత్తకోట మండల బీసీ సంక్షేమ సంఘ అధ్య క్షుడిగా దేవరింటి కుమార్ నియమితులయ్యారు. అన్నమయ్య జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శివప్రసాద్ నాయుడు ఆధ్వర్యంలో మంగళవారం బి.కొత్తకోటలో మండల కార్యవర్గ ఎంపిక జరిగింది. ఈ సందర్భంగా మండల బీసీ సంక్షేమసంఘం అధ్యక్షుడుగా టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి, గుమ్మసముద్రం పంచాయతీ అచ్చమ్మకోటకు చెందిన దేవరింటి కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకుని ఆ మేరకు నియామకపత్రాన్ని అందజేశారు. అదే విధంగా మండల ప్రధాన కార్యదర్శిగా శిల్పా అంజి, గౌరవాధ్యక్షుడిగా సిద్దప్పనాయుడులతో పాటు ఇతర కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ తన మీద నమ్మకంతో ఈ పదవి ఇచ్చిన సంఘ పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు. పలువురు బీసీ నాయకులు కుమార్ ను అభినందిస్తూ, దుశ్శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో బీసీ నాయకులు మధుకర్‌యాదవ్, మాజీఉప సర్పంచ్ సమీవుల్లా,శివానంద, సిద్దప్పనాయుడు, రవియాదవ్, శ్రీనాథ్‌నాయుడు పాల్గొన్నారు.

రెచ్చగొట్టే ప్రసంగాలతోనే.. దాడులు

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 20: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగిస్తున్న ప్రతి బహిరంగ సభలోనూ తాను యుద్ధం చేస్తున్నది చంద్రబాబుతో కాదని, ఆంధ్రజ్యోతి, ఈనాడు, టీవీ5లతోనే అంటూ రెచ్చగొట్టే ప్రసంగాలు చేయడమే ఆయా సంస్థల విలేకరులు, ఫొటో గ్రాఫర్లపై దాడులకు కారణమని, దీనికి ముఖ్యమంత్రే ప్రధాన బాధ్యుడు అవుతాడని న్యాయకోవిదులు అభిప్రాయపడుతున్నారు. హింసతో సమాధానం చెప్పదలుచుకుంటే ప్రజా స్వామ్యానికి అర్థమే ఉండదని అంటున్నారు. దాడులు ప్రోత్సహించి పాలన చేయాలనుకునే వారు కనుమరుగు కావడానికి ఎంతో కాలం పట్టదని అంటున్నారు. వారి మాటల్లోనే....


రెచ్చగొట్టేవారూ నేరస్థులే..



బహిరంగ సభల్లో చేసిన ప్రసంగాలతో ఆవేశానికి లోనైన వ్యక్తులు దాడులు చేస్తే ఐపీసీ సెక్షన్ 505 ప్రకారం మూడేళ్ల వరకు జైలు శిక్ష అను భవించాల్సి ఉంటుంది. పథకం ప్రకారం ఫొటోగ్రాఫర్‌ను హత మార్చడా నికి వచ్చినట్లు ఉంది కాబట్టి.. 307 ఐపీసీతో పాటు 324 వర్తిస్తుంది. రాజ్యాంగబద్ధంగా విధులు నిర్వహిస్తానని ప్రమాణం చేసిన ముఖ్యమంత్రి రెచ్చగొట్టే ప్రసంగాలు చేయడం నేరం.

- టీ. ఈశ్వర్, , ఉమ్మడి కడప జిల్లా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు

బడుగు, బలహీనులకు రక్షణే కరువైంది



వైసీపీ ప్రభుత్వంలో బడుగు, బలహీన వర్గాలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. నా బీసీలు, నా ఎస్సీలు, నా ఎస్టీలు అని ప్రసంగాలు చేసే జగన్ మోహన్‌రెడ్డి.. ఆయా వర్గాలపై దాడులు చేసే వారిపై చర్యలు తీసుకోవడం లేదు. వాస్తవాలను ప్రజల దృష్టికి తీసుకెళుతున్న వారిపై దాడులు జరుగుతున్నాయి. రాప్తాడులో ఫొటో గ్రాఫర్‌పై జరిగిన దాడి హేయమైనది. ఇలాంటి చర్యలకు ప్రతి ఒక్కరూ ఖండించాలి.

- డీ. నాగముని, జిల్లా అధ్యక్షుడు, బీసీ న్యాయవాదుల సంఘం

రాచరిక పాలనకు బీజాలు



రాజ్యాంగం ప్రజలకు కల్పించిన హక్కులు మన రాష్ట్రంలో ప్రశ్నార్థకం అవుతున్నాయి. ప్రశ్నించిన వారిని నామరూపాలు లేకుండా చేస్తున్నారు. గత ఐదేళ్ల వ్యవధిలో రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాలపైన జరిగిన దాడులే ఇందుకు నిదర్శనం. ఇదేమిటని ప్రశ్నించే పత్రికా రంగంపైన.. ముఖ్యంగా విలేకరులపైన అమానవీయ దాడులు జరుగుతున్నాయి. రాప్తాడులో విలేకరి కృష్ణపై జరిగిన దాడి ఈ కోవలోనిదే.

- రాజ్‌కుమార్‌రాజు, ప్రధాన కార్యదర్శి, అన్నమయ్య జిల్లా న్యాయవాదుల సంక్షేమ సమితి,

రాజ్యాంగాన్ని పక్కన పెట్టాలని చూస్తున్నారు



దేశంలో ఎవరికీ రాజ్యాంగ విరుద్ధంగా ప్రవర్తించే హక్కులేదు. ఈ ఐదేళ్లలో మన రాష్ట్ర ప్రభుత్వం ప్రజల అన్ని రకాల హక్కులను కాలరాస్తోంది. ప్రజల వైపు నిలబడుతున్న మీడియా నోరు మూయించడానికి ఆ సంస్థల ప్రతినిధులపై దాడులు చేస్తున్నారు. ఈ సంఘటనను ముఖ్యమంత్రి కనీసం ఖండించే ప్రయత్నం కూడా చేయకపోవడంతో.. ఈ దాడి వెనుక ఆయన హస్తం ఉందని అనుకోవాల్సి వస్తుంది.

- బీవీ రమణ, బీఎస్పీ లీగల్ అడ్వైజర్